


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్ గిరి | శుక్రవారం | 16-10-2026 | సంపుటి: 3 | సంచిక: 252 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | FRIDAY | 16-10-2026 | VOLUME : 3 | ISSUE : 252 | PAGES: 8 | COST: 2/- |

న్యాయవ్యవస్థను ఎవరూ
## బెదిరించలేరు

- రాహుల్‌గాంధీ పిటిషన్ విచారణలో సీజేఐ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు
- సుప్రీంకోర్టు ప్రాంగణం వరకు పాదయాత్రపై గౌరవ్ భాటియా అభ్యంతరం
- ఒత్తిళ్లకు న్యాయవ్యవస్థ తలొగ్గదన్న ప్రధాన న్యాయమూర్తి

4



## మతం మారితే కుల రిజర్వేషన్ వర్తించదు: సుప్రీంకోర్టు

- ముస్లిం బీసీ రిజర్వేషన్లపై తమిళనాడు ప్రభుత్వానికి ఎదురుదెబ్బ
- మద్రాస్ హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం
- మత మార్పిడితో కుల గుర్తింపు స్వయంచాలకంగా రాదని స్పష్టీకరణ

4





# ఎల్ నినో చాలా తీవ్రమైంది!



నీటి, పశుగ్రాసం
## కొరత ఉండొద్దు

- ఎల్‌నినో ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ చేపట్టాలి
- ఏజెన్సీ ప్రాంతాల్లో 125 రోజుల 'ఉపాధి' పనులు తప్పనిసరి
- గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

2

- ఎదుర్కొనేందుకు కార్యాచరణ ప్రణాళిక
- నీటిని, విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలి
- రైతులు, ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలి
- ఎంత ఖర్చయినా విద్యుత్ కొనుగోలు చేస్తున్నాం
- వొచ్చే సీజన్లో రైతులు వరి పంట వేయొద్దు
- తాగునీటికే క్లిష్టమైన పరిస్థితి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 15: ప్రస్తుత ఎల్నినోను ఎదుర్కొనడానికి అందుబాటులో ఉన్న మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో చర్చించి ఒక కార్యాచరణను రూపొందించామని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఇది గతంలో వొచ్చిన ఎల్నినోలకంటే తీవ్రమైందన్నారు. నీటికొరత ఏర్పడే పరిస్థితి వున్నదని శాస్త్రవేత్తలు హెచ్చరించిన నేపథ్యంలో ఈ ప్రకృతి విపత్తును ఎదుర్కొనేందుకు ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సాగు, తాగునీటి కొరతతో పాటు విద్యుత్ కొరత కూడా ఏర్పడుతోంది.వానాకాలంలోనే ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. రాష్ట్రంలో 13 లక్షల ఎకరాల్లో వరి కాకుండా ఇతర పంటలు వేశారు.56 లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు.అక్టోబర్ నెలలో 15 వేల మెగావాట్లు ఉండాల్సిన విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పెరిగింది. అంటే అదనంగా 5 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పెరిగింది.రాష్ట్రంలోని

మిగతా 2వ పేజీలో..

## సంపద సృష్టికర్తలకు సహకారం



- రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములుగా నిలవాలి
- సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు గార్డియన్‌గా ఉంటా
- పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం భట్టి భరోసా

హైదరాబాద్, అక్టోబర్ 15 : పెట్టుబడులకు తెలంగాణ అత్యంత సురక్షితమైన, అనుకూలమైన గమ్యస్థానం.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు తాను గార్డియన్‌గా వ్యవహరిస్తానని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పారిశ్రామికవేత్తలకు సహకారం అందించేందుకు కృషిచేస్తానని స్పష్టం చేశారు. హైటెక్స్‌లో జరుగుతున్న సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ మీట్ 2026 రెండో రోజు

మిగతా 3వ పేజీలో..

బీమా బంద్ తో రోడ్డునపడ్డ మూడువేల
## రైతు కుటుంబాలు



- బీమా అమలు చేయకుంటే సీఎం ఇంటిని ముట్టడిస్తాం
- రైతులకు నీళ్లు, కరెంటు ఇవ్వలేక చేతులెత్తేసిన ప్రభుత్వం
- సీఎం, డిప్యూటీ సీఎంల వైఫల్యం రాష్ట్రానికి శాపం
- అధికార్లను కాదు మిమ్మల్ని సస్పెండ్ చేయాలి
- సిద్దిపేటలో హరీష్ రావు ధ్వజం

3

బొగ్గు దిగుమతి పేరుతో
## రూ.3వేల కోట్ల కుంభకోణం

- భోత్రా లాజిస్టిక్స్ తో సీఎం చీకటి ఒప్పందం
- కావాలనే కృత్రిమ బొగ్గు కొరత
- కరెంట్ సంక్షోభం సృష్టించిందే రేవంత్
- మొత్తం స్కాంపై స్వతంత్ర విచారణ జరపాలి
- సింరేణికి రూ.60వేల కోట్ల బకాయిలకు ఎగనామం
- దిగుమతి చేసుకునే బొగ్గుకు టన్నుకు రూ.1500 కమీషన్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2





## బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాల వల్లే సింగరేణికి నష్టం

- వేలంలో పాల్గొనక కోయగూడెం, సత్తుపల్లి గనులను కోల్పోయింది
- బహుళ అంచెల నిఘా వ్యవస్థతో బొగ్గు మాయమయ్యే ప్రసక్తే లేదు
- రెండేళ్లలోనే నైనీ, తాడిచర్ల-2 గనులకు మైనింగ్ అనుమతులు సాధించాం
- ఆధారాలు ఉంటే బయటపెట్టాలి, లేకపోతే దుష్ప్రచారం మానాలి
- బీఆర్ఎస్ ఆరోపణలకు మంత్రి శ్రీధర్‌బాబు ఘాటు కౌంటర్

2

## 22ఏతో భూ యజమానులకు ఇబ్బందులు

- ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్న ప్రభుత్వం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

2



యాదాద్రి ప్లాంట్ సీఈపై
## సస్పెన్షన్ వేటు

- నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంపై రేవంత్ సర్కార్ చర్యలు
- ప్లాంట్ పర్యవేక్షణకు ఐదుగురు ఐఏఎస్ అధికారుల నియామకం
- క్షేత్రస్థాయిలోనే సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ
- విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాల సాధనపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

3

## 2.50 లక్షల లంచం

- ఏసీబీ వలలో డిప్యూటీ తహసీల్దార్!
- భూమిని నిషేధిత జాబితా నుంచి
- తొలగించేందుకు రూ.5 లక్షల డిమాండ్
- డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డితోపాటు మరో ఇద్దరు పట్టివేత
- వీఆరఏ విజయ్‌కుమార్, రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణ అదుపులోకి

4

నేడు 41 బార్లకు
## లక్కీ డ్రా..

- ఉదయం 11 గంటలకు లైసెన్సుల ఎంపిక
- టీసీయూఆర్ పరిధిలోని 14 బార్లకు 4,251 అప్లికేషన్లు
- ఇతర ప్రాంతాల్లోని 27 బార్లకు 4,519 దరఖాస్తులు
- ఉదయం 9 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని అధికారుల సూచన

2





## నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలి

- ప్రామాణిక అర్బన్ పోలీసింగ్ అవసరం
- నేరాల కట్టడికి నిరంతర గస్తీ
- స్పందించే తీరును బట్టే పోలీసుల పనితీరుపై అంచనా
- మల్కాజిగిరి కమిషనరేట్ సమీక్షలో డీజీపీ ఆనంద్

హైదరాబాద్, అక్టోబరు 15: నేరాల నియంత్రణకు నిరంతర పెట్రోలింగ్, పటిష్ఠ నిఘా, సత్వర స్పందన కీలకమని డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. అర్బన్ పోలీసింగ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, వినూత్న విధానాలను వినియోగిస్తూ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. నేరాల స్వభావం, ప్రాంతాల వారీ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని గస్తీ, నిఘా పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్‌లో సీపీ సుమతి, ఇతర పోలీసు అధికారులతో గురువారంనిర్వహించిన సమీక్షలో ఆయన నేరాల నియంత్రణ, దర్యాప్తు, రాత్రి గస్తీ, రోడ్డు

మిగతా 3వ పేజీలో..

## పండగల వేళ నిరసనలతో వ్యాపారులకు నష్టం

- దీపావళి వరకు ఆందోళనలకు అనుమతివ్వొద్దని అమిత్ షాకు వ్యాపార సంఘం లేఖ
- అక్టోబర్ 16న కన్నాట్ ప్లేస్‌లో సీజేపీ నిరసన
- అక్టోబర్ 10 ఆందోళనతో రూ.2,000 కోట్ల నష్టం
- ఢిల్లీలో 20 లక్షల మంది వ్యాపారులపై ప్రభావం పడే అవకాశం

4

# బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాల వల్లే సింగరేణికి నష్టం

**హైదరాబాద్, అక్టోబర్ 15 :**
సింగరేణి సంస్థపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌, పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలపై ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే సింగరేణికి తీరని నష్టం జరిగిందని, ఆ తప్పులను కప్పిపుచ్చుకోవడానికే ఇప్పుడు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. గత పదేళ్లలో ఇంధన సరఫరా ఒప్పందాలు ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఏటా సగటున సుమారు 4 మిలియన్ టన్నుల జీ9 గ్రేడ్ బొగ్గు సరఫరా అయిందని మంత్రి తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సింగరేణి 25 మిలియన్ టన్నులకుపైగా బొగ్గు సరఫరా చేయగా, అందులో జీ9 గ్రేడ్ బొగ్గు 1.20 మిలియన్ టన్నులు మాత్రమేనని, అందులోనూ 0.52 మిలియన్ టన్నులు తెలంగాణ జెన్కోకే వెళ్ళింద ని చెప్పారు. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు ఏటా 14 మిలియన్ టన్నుల జీ9 బొగ్గు సరఫరా చేసేలా ఒప్పందం చేసుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం, దానికి తగ్గట్టుగా కొత్త గనులను ఎందుకు తెచ్చి ఉత్పత్తిని పెంచలేకపోయిందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన వేలంలో సింగరేణిని పాల్గొననివ్వకపోవడం వల్లే కీలకమైన కోయగూడెం3, సత్తుపల్లి3 బ్లాకులు దక్కలేదని, ఫలితంగా ఏటా 10 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి అవకాశాన్ని సంస్థ కోల్పోయిందన్నారు. అలాగే 14 గనులు మూతపడటంతో మరో 15 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని కోల్పోవడం వాస్తవం కాదా అని నిలదీశారు.

**రెండేళ్లలోనే నైనీ, తాడిచర్ల-2 అనుమతులు సాధించాం**
తమ ప్రజా ప్రభుత్వం వచ్చిన కేవలం రెండేళ్లలోనే నైనీ బొగ్గు గనికి అనుమతులు సాధించి ఉత్పత్తికి మార్గం సుగమం చేశామని శ్రీధర్‌బాబు చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నైనీ వైపు కన్నెత్తి కూడా చూడలేదని విమర్శించారు. 2013లో యూపీఏ ప్రభుత్వం మంజూరు చేసిన తాడిచర్ల బ్లాక్ 2కు మైనింగ్ అనుమతులు తెచ్చామని, వేలం ద్వారా మణుగూరు పీకే ఓసీ2 డిప్సైడ్ బ్లాక్‌ను సింగరేణికి దక్కించామని వివరించారు. వీటన్నింటి ద్వారా రానున్న రోజుల్లో సంస్థ ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని స్పష్టం చేశారు.

**బహుళ అంచెల నిఘా వ్యవస్థ – బొగ్గు మాయం అసాధ్యం**
సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, లోడింగ్, రవాణా, తూకం నుంచి పంపిణీ వరకు ప్రతీ దశలోనూ సాంకేతిక ఆధారిత బహుళ అంచెల నిఘా వ్యవస్థ అమలులో ఉందని మంత్రి తెలిపారు. ఎస్ఏపీ/ఈఆర్‌పీ అనుసంధానం, జీపీఎస్/జీపీఆర్ఎస్ ద్వారా వాహనాల ట్రాకింగ్, జియోఫెన్సింగ్, ఎలక్ట్రానిక్ తూకం, ఆకస్మిక తనిఖీలు, బొగ్గు చోరీ నిరోధక బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని చెప్పారు. ప్రతీ టన్ను బొగ్గుకు పక్కా లెక్క ఉన్న ఈ వ్యవస్థలో బొగ్గు మాయమయ్యే అవకాశమే లేదన్నారు. బీఆర్ఎస్ నాయకుల వద్ద ఆధారాలు ఉంటే బయట పెట్టాలని, లేకపోతే సింగరేణి కార్మికులు, అధికారుల నిజాయతీపై బురద చల్లడం మానాలని శ్రీధర్‌బాబు హెచ్చరించారు.

**సంస్థ ప్రయోజనం కోసమే సైట్ విజిట్ నిబంధన**
ఓవర్ బర్డెన్ తొలగింపు టెండర్లలో 'సైట్ విజిట్ సర్టిఫికెట్' నిబంధనను పారదర్శకత కోసం, సంస్థ శ్రేయస్సు కోసమే ప్రవేశపెట్టామని మంత్రి సమర్థించుకున్నారు. గతంలో కాంట్రాక్టర్లు క్షేత్రస్థాయి భౌగోళిక పరిస్థితులు చూడకుండానే టెండర్లు వేసి, తర్వాత పనులు చేయలేక మధ్యలోనే వదిలేసి వెళ్లేవారని, దాని వల్ల సింగరేణికే నష్టం జరిగేదని గుర్తుచేశారు. ఈ నిబంధన వల్ల సమర్థులైన కాంట్రాక్టర్లు ఎలాంటి అవాంతరాలు లేకుండా పనులు పూర్తిచేస్తున్నారని తెలిపారు. జీఎండీసీగుజరాత్, జీఐపీసీఎల్, ఎన్ఎండీసీ, కొన్ని సోలార్ ప్రాజెక్టులు,ఈపీసీ కాంట్రాక్టుల్లోనూ, అలాగే 2018, 2021, 2023లో గత ప్రభుత్వ హయాంలోనూ సీఎంపీడీఐ సలహా మేరకు ఈ నిబంధన అమల్లో ఉందని, అప్పుడు సరైనదైన నిబంధన ఇప్పుడు తప్పెలా అవుతుందని శ్రీధర్‌బాబు ప్రశ్నించారు.

**సింగరేణిని ఏటీఎంలా వాడుకున్నది బీఆర్ఎస్సే**
పదేళ్ల పాలనలో బీఆర్ ఎస్ సింగరేణిని ఏటీఎంలా వాడుకున్నదని, విద్యుత్ సంస్థల పేరుతో రూ.వేల కోట్ల బకాయిలు పెట్టి సింగరేణిని అప్పుల ఊబిలోకి నెట్టిందని శ్రీధర్‌బాబు విమర్శించారు. కాళేశ్వరం నుంచి మిషన్ భగీరథ వరకు రూ.లక్ష కోట్ల కుంభకోణాలకు పాల్పడిన వారు అవినీతి గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు.

# నేడు 41 బార్లకు లక్కీ డ్రా..

**హైదరాబాద్, అక్టోబర్ 15:**
తెలంగాణలో కొత్త బార్ల లైసెన్సుల కేటాయింపునకు ఎక్సైజ్ శాఖ సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా 41 బార్లకు వచ్చిన 8,770 దరఖాస్తుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు లక్కీ డ్రా నిర్వహించనున్నారు. దరఖాస్తుదారుల సమక్షంలో ఈ ప్రక్రియ చేపట్టి లైసెన్సులు కేటాయించనున్నారు. టీసీయూఆర్ పరిధిలోని 14 బార్ల కోసం 4,251 దరఖాస్తులు రాగా, ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని 27 బార్లకు 4,519 అప్లికేషన్లు వచ్చాయి. పరిమిత సంఖ్యలో ఉన్న బార్లకు భారీగా దరఖాస్తులు రావడంతో లైసెన్సులు ఎవరికి దక్కుతాయనే ఆసక్తి నెలకొంది.

**టీసీయూఆర్ బార్లకు డ్రా**
టీసీయూఆర్ పరిధిలోని 14 బార్లకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ లక్కీ డ్రా నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియను సైబరాబాద్, గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షిస్తారు. గండిపేట మండలం నార్సింగ్‌లోని ది అడ్రస్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్‌లో డ్రా నిర్వహించనున్నట్లు సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ జె. హరికిషన్ వెల్లడించారు. మిగిలిన ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్లు లక్కీ డ్రా ద్వారా లైసెన్సుదారులను ఎంపిక చేయనున్నారు.

**ఉదయం 9 గంటలకే చేరుకోవాలి**
లక్కీ డ్రాకు సంబంధించిన సమాచారాన్ని దరఖాస్తుదారులకు వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా పంపించినట్లు అధికారులు తెలిపారు. వారంతా శుక్రవారం ఉదయం 9 గంటలకల్లా సంబంధిత కేంద్రాలకు చేరుకోవాలని డిప్యూటీ కమిషనర్లు సూచించారు. డ్రా పూర్తయితే 41 బార్లకు కొత్త లైసెన్సులు ఎవరికి దక్కనున్నాయో స్పష్టత రానుంది.

# 22-ఏతో భూ యజమానులకు ఇబ్బందులు

**హైదరాబాద్, అక్టోబర్ 15 :**
రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. గురువారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ చాలా చోట్ల 2030 ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న భూములను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారన్నారు. తమ భూమి తమకు ఉంటుందో లేదోనన్న ఆందోళనతో బాధితులు కలెక్టరేట్ల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ పేరుతో అవినీతి జరుగుతోందని, నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించుకోవాలంటే లంచాలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. ఇదే నేపథ్యంలో రాష్ట్రంలో ఇటీవల అనేకమంది రెవెన్యూ అధికారులను ఏసీబీ పట్టుకుంటున్న ఘటనలు కూడా చూస్తున్నామన్నారు. శామీర్‌పేట మండలం బొమ్రాస్‌పేటలో సుమారు 1,500 ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, ఆ రైతులు తమ సమస్య పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లోనూ ఒక సర్వే నంబరులో ఏదో ఒక ప్లాట్ ప్రభుత్వ భూమి ఉందనే కారణంతో ఆ సర్వే నంబర్‌లోని మొత్తం భూమిని నిషేధిత జాబితాలో చేరుస్తున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతుండగా, బడా బాబులు, బిల్డర్లు లాభపడుతున్నారన్నారు. ప్రజల భూముల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం నిషేధిత జాబితా పేరుతో వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. 22ఏ జాబితాలో భూముల చేర్పు, తొలగింపుల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ అంశానికి సంబంధించిన పలు కీలక వివరాలను బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెల్లడించారు. 22ఏ సమస్యపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని రామచందర్‌రావు డిమాండ్ చేశారు.

# ఎల్ నినో చాలా తీవ్రమైంది!

మొదటిపేజీ తరువాయి
30 లక్షల పంప్‌సెట్లు ఆన్ అయ్యాయి.మార్చిలో ఉండాల్సిన ఉష్ణోగ్రత అక్టోబర్‌లో ఉంది.డిప్యూటీ సీఎం భట్టి, విద్యుత్ శాఖ అధికారులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయడం ద్వారా విద్యుత్ శాఖ మంత్రి, అధికారులు చిత్తశుద్ధిని చూపించారు.ఈ 13 ఏళ్లలో 14 వేల మెగావాట్ల అదనపు విద్యుత్ డిమాండ్ పెరిగింది.ఈ రెండేళ్లలో ఆరు, ఏడు వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పెరిగింది.విద్యుత్ శాఖ సమర్థవంతంగా పనిచేసి రైతులకు, ఇతర అవసరాలకు విద్యుత్‌ను సరఫరా చేస్తోంది.మరో 20 రోజుల్లో వానాకాలం పంటలు కోతకు వస్తాయి.చేతికొచ్చిన పంట ఎండిపోకూడదన్న లక్ష్యంతో మార్కెట్‌లో ఏ ధరకు విద్యుత్ దొరికినా కొనుగోలు చేసి రైతులకు అందిస్తున్నామన్నారు.కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు కూడా విద్యుత్ కొరతతో ఉన్నాయి. రైతులు మనోధైర్యం కోల్పోకుండా మా ప్రభుత్వం విద్యుత్‌ను సరఫరా చేస్తోంది.గృహ అవసరాలకు తగినట్లుగా విద్యుత్‌ను అందిస్తున్నాం.కృష్ణా బేసిన్‌లో 72 శాతం నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి.గోదావరి బేసిన్‌లో 40 శాతం నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి.23 శాతం లోటు వర్షపాతం ఉంది.అన్ని రిజర్వాయర్లు వట్టిపోయే దశలో ఉన్నాయి.24 వేల గ్రామాలకు మంచినీటి సరఫరా చేయాల్సి ఉంది.తాగునీటికే ఈ రోజు క్లిష్టమైన పరిస్థితి ఉందని గుర్తు చేశారు.

**ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం**
చలికాలం ఎండాకాలంలా ఉంది. వచ్చే 8 నుంచి 10 నెలల్లో తలెత్తే పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.కేంద్రం నుంచి ఎలాంటి సహకారం తీసుకోవాలనే దానిపై ఈ రోజు సమావేశంలో చర్చించాం.10 లక్షల ఎకరాల్లో పంట నష్టపోయే పరిస్థితి ఉందని నివేదికలు వచ్చాయి.ఎట్టి పరిస్థితుల్లోనూ పంటను ఎండిపోనివ్వొద్దని అధికారులను ఆదేశించామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో ఉన్న నీటిని చాలా పొదుపుగా వాడాలి.సాగుకు నీటిని పొదుపుగా వినియోగించాలి.460 టీఎంసీలు ఉండాల్సిన పరిస్థితుల్లో ఇప్పుడు కేవలం 209 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి .ఈ నీటిని పంటలకు ఇస్తే కేవలం నారుమళ్లకే సరిపోతాయి.ఎల్‌నినోను ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వానికి రైతులు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు.అందుబాటులో ఉన్న 200 టీఎంసీల నీళ్లను పొదుపుగా వినియోగించుకోవాలి. ఈ నీటిని కేవలం తాగునీటి కోసమే వాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.రైతులు పెద్ద మనసు చేసుకుని యాసంగిలో పంటలు వేయడం తగ్గించుకోవాలని కోరారు.చుక్క చుక్కను ఆదా చేసుకోవాలి. వచ్చే సీజన్‌లో వరి వేయడాన్ని వాయిదా వేసుకోవాలి.ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టడానికి కార్యాచరణను రూపొందిస్తున్నాం.గత ఏడాది ఈ సమయంలో 25 వేల మంది ఉపాధి హామీ పనులు చేస్తే, ప్రస్తుతం రెండున్నర లక్షల మంది పనుల్లో పాల్గొంటున్నారు.ఉపాధి హామీ పథకంలో చెరువులు, కుంటలను ప్రాధాన్యతగా తీసుకుని మరమ్మతులు చేయాలి.వానాకాలంలో నష్టపోయిన పంటతో పాటు వచ్చే సీజన్‌లో పంట వేయకుండా నష్టపోయిన రైతులను కేంద్ర ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలన్నారు.కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు ఇచ్చే పథకాల ద్వారా రైతులను ఆదుకోవాలి.కేంద్ర ప్రభుత్వం నుంచి ఉదారంగా సాయం తీసుకునే అంశంపై అధికారులు నివేదికలు తయారు చేయాలి.

**ఓవర్‌లోడ్ వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం**
ఓవర్‌లోడ్ వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతోంది. ప్రస్తుతం 20 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంది. విద్యుత్ ఉత్పత్తి చేయగలిగిన రాష్ట్రాల నుంచి విద్యుత్‌ను తీసుకుని, మిగిలిన రాష్ట్రాలకు తక్కువ ధరకు కేంద్రం అందించాలి. కోవిడ్ సమయంలో ప్రధాని మోదీ ఏం చేయమన్నా చేశాం. ఆ రోజు విధానాలు, జెండాలు మేం చూడలేదు. ఒకే విధానంలో ముందుకు వెళ్లాలన్న ప్రధాని అప్పీల్‌కు అనుగుణంగా ముందుకు వచ్చాం. ప్రస్తుతం రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు అదే స్ఫూర్తితో వ్యవహరించాలి. అన్ని పార్టీలు, ప్రతి పౌరుడు ప్రభుత్వానికి సహకరించాలి. ప్రభుత్వ సూచనలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలి. ప్రకృతి విపత్తును కలిసికట్టుగా నిలబడి ఎదుర్కోవాలి. అందరి సహకారం ప్రభుత్వానికి కావాలి. మీడియా సహకారం ప్రభుత్వానికి వందకు వంద శాతం అవసరం. ప్రభుత్వం నుంచి మీడియా కోసం ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమిస్తాం. టోల్ ఫ్రీ నంబర్ ఇస్తాం. ప్రతిపక్షాలు, కార్మిక సంఘాలు.. అందరితో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తాం. పశువులకు తాగునీరు, పశుగ్రాసం అత్యంత ముఖ్యం. లేకుంటే పిట్టల్లా రాలిపోయే ప్రమాదం ఉంది. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల ఏర్పడే సమస్యలపై వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేశాం.పేదలకు ఏ కష్టం వచ్చినా తక్షణమే ఆదుకోవాలన్న కార్యాచరణను రూపొందించాం. ఎల్‌నినోను ఎదుర్కోవడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలి. ఈ సమస్యను ఎదుర్కోవడంపై నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. ప్రభుత్వం నిత్యం దీనిపై అప్రమత్తంగా ఉంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నాయకత్వంలో దసరా తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని వివరిస్తాం. ముఖ్యమంత్రి నాయకత్వంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర హోంశాఖ మంత్రిని, ఇతర మంత్రులను కలుస్తాం. ప్రజలను చైతన్యపరచడానికి కళాజాతాలను ఏర్పాటు చేస్తాం. సీనియర్ జర్నలిస్టులు, నిపుణులు పత్రికల్లో వ్యాసాలు రాయాలి. సినీ నటుడు విజయ్ దేవరకొండ ఎల్‌నినోపై ఒక విజ్ఞప్తి చేశారు. మిగిలిన సినీ నటులు, క్రీడాకారులు, కళాకారుల సహకారం తీసుకుని వారితో ప్రజలకు ఒక విజ్ఞప్తి చేయించి అప్రమత్తం చేస్తాం. అందరి సమస్య.. అందరం కలిసి విజయవంతంగా ఎదుర్కోవాలన్నారు.

# నీటి, పశుగ్రాసం కొరత ఉండొద్దు

**హైదరాబాద్, అక్టోబర్ 15 :**
ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో తలెత్తే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు ఇప్పటినుంచే సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి కొరత, ఉపాధి సమస్యలు, పశుగ్రాసం కొరత వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ, గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి ఆదివాసీ గిరిజన కుటుంబానికి కనీసం 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని స్పష్టం చేశారు. వీబీ జీ రామ్ జీ ద్వారా కరువు నివారణ చర్యలపై బేగంపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. గ్రామంలోని చిట్టచివరి వ్యక్తి అభివృద్ధి చెందడమే నిజమైన సమగ్ర అభివృద్ధి అని మంత్రి స్పష్టం చేశారు. మారుమూల గిరిజన గ్రామాలు కూడా ఇతర గ్రామాలతో సమానంగా అభివృద్ధి చెందేలా అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. గతంలో ఆదివాసి గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం వివిధ శాఖల సమన్వయంతో చేపట్టిన కార్యక్రమాల స్ఫూర్తితో ప్రస్తుతం కూడా ఐటీడీఏలు, పంచాయతీరాజ్ శాఖ, పేదరిక నిర్మూలన సంస్థ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

**వర్షపాతం లోటు నేపథ్యంలో ముందస్తు చర్యలు**
రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 16 నుంచి 18 జిల్లాలు సాధారణ వర్షపాతం కంటే 20 శాతానికిపైగా లోటుతో ఉన్నాయని సదస్సు నివేదిక పేర్కొంది. 18 జిల్లాల పరిధిలోని 320 మండలాలల్లో తీవ్ర ఎల్నినో ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిందని వివరించింది. ఈ సీజన్‌లో ఎల్‌నినో పరిస్థితులు మరింత బలపడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. వర్షపాతం లోటు ఉన్నప్పటికీ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వేసవి ప్రభావం ఈసారి దాదాపు ఎనిమిది నెలలపాటు ఎదుర్కోవాల్సి రావచ్చని అన్నారు.

**ఆదివాసీ గిరిజన కుటుంబాలకు 125 రోజుల ఉపాధి కల్పించాలి**
ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యవసాయం ప్రధానంగా ఒకే పంటకు పరిమితమవుతుందని, రెండో పంట సాగు చేసే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని మంత్రి వివరించారు. దీంతో ఆదివాసి గిరిజన కుటుంబాలకు ఆదాయ భద్రత కల్పించడంలో ఉపాధి హామీ పథకం కీలకమన్నారు. ప్రతి ఆదివాసీ గిరిజన కుటుంబానికి తప్పనిసరిగా 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, ప్రతి కుటుంబానికి జాబ్‌కార్డు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే ఐదు నెలల్లో ప్రతి జాబ్ కార్డుకు నెలకు కనీసం రూ.7,500 వేతనం లభించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ఆదివాసి గిరిజన నివాస ప్రాంతంలో కనీసం ఒక మేట్‌ను నియమించాలని, వేతనాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి పనుల అమలులో సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

**ఉపాధి పనులతో గ్రామాలకు శాశ్వత ఆస్తులు**
ఉపాధి హామీ పథకం కింద కేవలం కూలీలకు పని కల్పించడమే కాక గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే శాశ్వత ఆస్తులను సృష్టించాలని మంత్రి సీతక్క సూచించారు. ఉపాధి హామీ కింద అందుబాటులో ఉన్న 370 రకాల పనులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలన్నారు. మట్టి, మొరం రహదారులు, గ్రామాలకు వెళ్లే బాటలు, అన్ని కాలాల్లో వినియోగించుకునే రహదారులు, ఊట చెరువులు, పెర్కొలేషన్ ట్యాంకులు, చెరువుల్లో పూడికతీత, కాలువలు, ఫీడర్ ఛానళ్లు, కందకాల తవ్వకం వంటి పనులను విస్తృతంగా చేపట్టాలని సూచించారు.

**పశువులకు నీరు, గ్రాసం అందేలా చర్యలు**
ఏజెన్సీ ప్రాంతాల్లో పశు సంపద ఎక్కువగా ఉంటుందన్న మంత్రి పశువులకు అవసరమైన నీరు, గ్రాసం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో చెక్‌డ్యాంల నిర్మాణం, నీటి సంరక్షణ పనులు చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టాలన్నారు. ఉపాధి హామీ పనులను స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తే గ్రామాల అభివృద్ధితో పాటు కరువు ప్రభావాన్ని తగ్గించవచ్చని తెలిపారు.అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడే ప్రజల సమస్యలు తెలుస్తాయని, వాటికి తగిన పరిష్కారాలు కనుగొనగలమని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

**సమన్వయంతో ఎల్‌నినోను ఎదుర్కోవాలి**
పంచాయతీరాజ్ శాఖ, ఐటీడీఏలు, పేదరిక నిర్మూలన సంస్థలు సమన్వయంతో పనిచేసి ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవాలని మంత్రి పిలుపునిచ్చారు. సర్పంచులు, క్షేత్రస్థాయి సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులను భాగస్వాములను చేస్తూ ఉపాధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధి కల్పనతోపాటు నీటి సంరక్షణ, పశుగ్రాసం అభివృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్‌తో పాటు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్లు, ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అదనపు డీఆర్‌డీవోలు, పీవోలు, ఎంపీడీవోలు సదస్సులో పాల్గొన్నారు.

# బొగ్గు దిగుమతి పేరుతో రూ.3వేల కోట్ల కుంభకోణం

**హైదరాబాద్, అక్టోబర్ 15 :**
రాష్ట్రంలో బొగ్గు, విద్యుత్ సంక్షోభాన్ని సృష్టించి ఇప్పుడు అదే సంక్షోభాన్ని కుంటిసాకుగా చూపి విదేశీ బొగ్గు దిగుమతి పేరుతో సుమారు రూ.3,000 కోట్ల భారీ బొగ్గు కుంభకోణానికి తెరలేపడం అత్యంత దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రాసిన లేఖలో తీవ్రంగా తప్పుబట్టారు. ఇటు సింగరేణికి ఉత్పత్తి సామర్థ్యం ఉన్నా, అటు దేశంలో బొగ్గు వనరులు అందుబాటులో ఉన్నా దేశీయ సరఫరాను పెంచే దిశగా చర్యలు తీసుకోకుండా విదేశీ బొగ్గు వైపే మొగ్గు చూపడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. విద్యుత్ సంక్షోభాన్ని ముందస్తు ప్రణాళికతో ఎదుర్కోవాల్సిన ప్రభుత్వం, ఇప్పుడు కరెంట్ కోతలపై ప్రజలు, రైతుల ఆందోళనను బూచిగా చూపి దిగుమతులకు అనుకూలంగా మలుచుకోవడం వెనక భారీ స్కాం దాగి ఉన్నట్టు అర్థమవుతోందన్నారు. ఈ వ్యవహారంలో భోత్రా లాజిస్టిక్స్ అనే కంపెనీ పాత్ర అత్యంత అనుమానాస్పదంగా కనిపిస్తోందని, ఈ కంపెనీకి సింగరేణిలో కాంట్రాక్టులు అప్పగించడంలో అనుసరించిన ప్రమాణాలేమిటి? ఏ అర్హతల ఆధారంగా ఈ సంస్థను ఎంపిక చేశారు? టెండర్ల ప్రక్రియ ఎంత పారదర్శకంగా జరిగింది? ఈ ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. లాజిస్టిక్స్ తో సింగరేణి, రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు, టెండర్ల వివరాలు, చెల్లింపులన్నింటినీ బహిర్గతం చేయాలి.. ఈ కంపెనీ ఎంపికకు కారణాలు, దానికి ఇప్పటి వరకు అప్పగించిన కాంట్రాక్టులు, చెల్లించిన నిధులపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. విదేశీ బొగ్గు దిగుమతుల వ్యవహారంలో ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నారో ముఖ్యమంత్రి ప్రజలకు స్పష్టం చేయాలని కోరారు. టన్నుకు రూ.1,500 కమీషన్ చొప్పున ఏకంగా రూ.3,000 కోట్ల దోపిడీకి మీరు చీకటి ఒప్పందాలు చేసుకున్నట్టు అర్థమవుతోందన్నారు.
విద్యుత్ డిమాండ్ వేసవిలో పెరుగుతుందని, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతర బొగ్గు సరఫరా అవసరమని ప్రభుత్వానికి ముందే తెలుసు. గనుల అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాలు, బొగ్గు నిల్వలు, రవాణా, దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి తగ్గిపోవడం ఈ సంక్షోభంలో కీలకమైన అంశమని. 2023-24లో సుమారు 70.02 మిలియన్ టన్నుల ఉత్పత్తి నమోదు కాగా, 2025-26లో ఉత్పత్తి సుమారు 58 మిలియన్ టన్నులకు పడిపోయింది. ఇది మీ ప్రభుత్వ వైఫల్యం కాదా, మీ నిర్లక్ష్యానికి ప్రజాధనం వృధా చేసి భారీ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితిని ఎందుకు సృష్టించారు అని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ జరగాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. సింగరేణికి రావాల్సిన బకాయిల విషయంలోనూ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. గనుల అభివృద్ధికి, ఉత్పత్తి పెంపునకు అవసరమైన నిధులు అందించకుండా సింగరేణి సామర్థ్యాన్ని దెబ్బతీసి, ఆ తర్వాత దేశీయ బొగ్గు సరిపోవడం లేదని చెప్పడం మీ ప్రభుత్వ ద్వంద్వ వైఖరి కాదా? అని ప్రశ్నించారు.
ఒడిశాలోని నైని బ్లాక్‌లో సింగరేణి బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైన నేపథ్యంలో అక్కడి నుంచి సరఫరాను పెంచేందుకు ఏ చర్యలు తీసుకున్నారు? మహానది ప్రాంతం నుంచి బొగ్గు సరఫరా చేసుకునే అవకాశాలున్నా ఎందుకు చేయలేకపోయారో సమాధానం చెప్పాలని కోరారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు బొగ్గు సరఫరా విషయంలోనూ మీ వాదనకు అర్థంలేదన్నది స్పష్టమైందన్నారు. 2018 ఫిబ్రవరి 15న కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఎఫ్.నెం.23014/1/2018సీఎల్డీ ప్రకారం సింగరేణి గనుల నుంచి యాదాద్రికి సంవత్సరానికి 14 మిలియన్ టన్నుల జి9 గ్రేడ్ బొగ్గు సరఫరాకు లింకేజీ కేటాయింపు జరిగింది. 2022 ఏప్రిల్ 27న సరఫరాకు సంబంధించి ఒప్పందం కూడా కుదిరింది. మరి ఇప్పుడు బొగ్గు కొరత, నాణ్యత సమస్యల పేరుతో విదేశీ బొగ్గు దిగుమతుల అవసరాన్ని ఎందుకు ముందుకు తెస్తున్నారని ప్రశ్నించారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో బొగ్గు, యాష్ హ్యాండ్లింగ్ వంటి పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించిన దుర్మార్గంపై మీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జెన్‌కోకు థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్వహణలో అనుభవజ్ఞులైన ఇంజినీర్లు,



సాంకేతిక నిపుణులు ఉన్నారు. సుమారు 7,500 మెగావాట్ల థర్మల్ విద్యుత్ సామర్థ్యం కలిగిన ప్లాంట్ల నిర్వహణ అనుభవం ఉన్నప్పుడు ప్రభుత్వ రంగ సంస్థల సామర్థ్యాన్ని వినియోగించకుండా ప్రైవేటు సంస్థలకు పనులు అప్పగించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. కరెంట్ కోతలపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు పెరిగినప్పుడు ప్రభుత్వం అధికారులపై నెపం నెట్టి తప్పించుకోవాలని చూడటం హేయమైన చర్య అన్నారు. నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. విదేశీ బొగ్గు దిగుమతుల ప్రతిపాదనలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, రూ.3,000 కోట్ల బొగ్గు కుంభకోణంపై స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి తగ్గుదలపై సమగ్ర నివేదిక విడుదల చేయాలి.. సింగరేణికి రావాల్సిన బకాయిలపై సంస్థల వారీగా పూర్తి లెక్కలు ప్రకటించాలి.. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు బొగ్గు సరఫరాపై స్పష్టత ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారు.

# సంపద సృష్టికర్తలకు సహకారం

మొదటిపేజీ తరువాయి

గురువారంనాటి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంపద సృష్టికర్తలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా అందించడంతోపాటు, పారిశ్రామిక పార్కుల ద్వారా భూమి, అవసరమైన విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దేశంలో భౌగోళికంగా అనువైన ప్రాంతంలో ఉండటం, పారిశ్రామిక అవసరాలకు తగిన భూమి అందుబాటులో ఉండటం, మెరుగైన మౌలిక సదుపాయాలు, విద్యాసంస్థల ద్వారా అభివృద్ధి చెందిన నైపుణ్యవంతమైన మానవ వనరులు రాష్ట్రానికి ప్రధాన బలాలని అన్నారు. హైదరాబాద్ వాతావరణం, బహుభాషా సంస్కృతి, వివిధ ప్రాంతాల ప్రజలను ఆదరించే సంప్రదాయం కూడా పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంటాయని చెప్పారు. మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం మరిన్ని పెట్టుబడులను తీసుకురావడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని వివరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి కోర్, ప్యూర్, రేర్ అనే మ□డు విధానాల ద్వారా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వాటి గురించి సవివరంగా భట్టి విక్రమార్క తెలిపారు.

**సంపద సృష్టిలో పారిశ్రామికవేత్తలదే కీలక పాత్ర**

మారుతున్న ఆర్థిక పరిస్థితుల్లో సంపద సృష్టికి వ్యవసాయంతోపాటు పరిశ్రమలు, సేవారంగం కీలకంగా మారాయని ఉప ముఖ్యమంత్రి అన్నారు. స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో వ్యవసాయ రంగం వాటా సుమారు 16 శాతం ఉండగా, పరిశ్రమలు, సేవారంగం కలిపి ఆర్థిక వ్యవస్థకు ప్రధానంగా దోహదపడుతున్నాయని వివరించారు. సేవారంగం వాటా సుమారు 65 శాతంగా ఉందని, పారిశ్రామిక రంగం కూడా ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఫార్మా, కోర్ ఇండస్ట్రీలు, ఆక్వా, ఎగుమతులు, దిగుమతులు, ఐటీ, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు వంటి విభిన్న రంగాల్లో ఉన్న వ్యాపారవేత్తలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి మరింతగా తోడ్పడాలని పిలుపునిచ్చారు. సంపద సృష్టించే వారికి ప్రతి రాష్ట్రం, ప్రతి సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పారిశ్రామికవేత్తలు ఎదగడంతోపాటు రాష్ట్రానికి ఉపాధి, పెట్టుబడులు, ఆదాయం పెరగడానికి దోహదపడాలని ఆకాంక్షించారు.

**పరిశ్రమలకు ప్రభుత్వ అండ**

సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం పెట్టుబడిదారులకు అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పెట్టుబడులకు అవసరమైన అనుమతులు, భూమి, విద్యుత్, నీరు వంటి సదుపాయాల కల్పనలో ప్రభుత్వ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. రాజకీయాలు, వ్యాపారం, సినీ పరిశ్రమ, వ్యవసాయం, ఐటీ, ఏరోస్పేస్, రక్షణ రంగం తదితర అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతుందని చెప్పారు.

**అందరినీ కలుపుకుని అభివృద్ధి సాధించాలి**

సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పారిశ్రామికవేత్తలు తమ అనుభవం, పరిజ్ఞానాన్ని ఇతర వర్గాలతో పంచుకోవాలని, కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. సమాఖ్య వంటి సంస్థల ద్వారా ఈ తరహా కార్యక్రమాలకు వేదికలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పెట్టుబడిదారులు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వం కూడా వారితో కలిసి పనిచేస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలకు స్వాగతం పలికిన భట్టి విక్రమార్క వ్యాపారాలు విస్తరించుకుంటూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు సహకరించాలని కోరారు.

# నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలి

మొదటిపేజీ తరువాయి



ప్రమాదాలు, సైబర్ నేరాలపై సమీక్షించారు. బొల్లారం కైకూరులోని విల్లా ఆర్కిడ్స్ గేటెడ్ కమ్యూనిటీలో ఐదు సంవత్సరాల పాప దారుణ హత్య ఘటన గుర్తు చేస్తూ నిందితుని అరెస్టు చేసినట్లు వివరించారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా పోలీసులు నిరంతరం నిఘాతోపాటు సీసీ టీవీలు కమ్యూనిటీలో ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. దీంతో పాటు బొల్లారంలోని ఆయుధాల చోరీ కేసుకు సంబంధించిన అంశాలను కూడా ఆయన ప్రస్తావిస్తూ ఆయుధాల చోరీ కేసులో పటిష్టమైన దర్యాప్తుతో వెంటనే అరెస్ట్ చేసామన్నారు. కమిషనరేట్ పరిధిలో ఇళ్లల్లో దొంగతనాలు చేస్తూ దొంగతనాన్ని పాల్పడ్డ నేపాల్ గ్యాంగ్ సంబంధించిన వాటిపైన దృష్టి సాదించాలని, చోరీ కేసులు పటిష్ట నిఘాతోని నియంత్రించాలని ఆదేశించారు. కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాలపై కళాశాలలు, గేటెడ్ కమ్యూనిటీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీజీపీ సూచించారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, ప్రమాదాల హాట్‌స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. కీసర, ఎల్‌బీనగర్, ఉప్పల్, బేగంపేట, జవహర్‌నగర్, మేడిపల్లి, కుషాయిగూడ తదితర ప్రాంతాల్లో ఆస్తి నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నేరాల గుర్తింపు, సొత్తు రికవరీని మెరుగుపరచడంతోపాటు తీవ్రమైన నేరాలు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. మురికివాడలు, బస్తీల్లో నేరాల హాట్‌స్పాట్లను గుర్తించి, పునరావృత నేరాలకు పాల్పడేవారిపై బైండోవర్ చర్యలు చేపట్టాలన్నారు.

మహిళలు, బాలికల భద్రతకు పోక్సో చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని డీజీపీ సూచించారు. షీ టీమ్స్ సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, జవహర్‌నగర్, హయత్‌నగర్, కుషాయిగూడ, వనస్థలిపురం, కీసర పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదవుతున్న పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కేసులను క్షుణ్ణంగా సమీక్షించి, సాంకేతిక ఆధారాలతో సమర్థవంతంగా దర్యాప్తు పూర్తి చేసి, గడువులోగా చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. బాధితులకు పరిహారం అందేలా చూడటంతోపాటు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని స్పష్టం చేశారు.

**గస్తీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

పోలీసు స్టేషన్ల వారీగా నేరాల నమోదును విశ్లేషిస్తూ నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్‌ఓలు) డయల్ 112 ఫిర్యాదులపై స్పందించడంతోపాటు గస్తీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేస్తే నేరగాళ్ల కదలికలను నియంత్రించవచ్చన్నారు. పాత నేరగాళ్ల ఇళ్లకు వెళ్లి వారి ప్రస్తుత కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, రౌడీషీటర్లను తరచూ తనిఖీ చేయాలని ఆదేశించారు. ఇందుకుగాను 1992 సంవత్సరంలోనే రౌడీలను, ఆర్గనైసేడ్ క్రైమ్స్ ను ఎదుర్కొనేందుకు ఏర్పాటు చేసినట్లుగా పేర్కొన్నారు.నేరం జరిగిన వెంటనే సంబంధిత బృందాలు రంగంలోకి దిగి ఆధారాలను సేకరించి, నిందితులను గుర్తించేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. డివిజన్ ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు, సెక్టార్ పోలీసులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు.

**కమిషనరేట్ పరిధిలో అక్టోబరు 13 నాటికి 2,474 కేసులు**

కమిషనరేట్ పరిధిలో 2026 అక్టోబరు 13 నాటికి 2,474 కేసులు నమోదైనట్లు సీపీ సుమతి వివరించారు. 2024లో 18,778 కేసులు నమోదు కాగా, 2025లో 18,480 కేసులు నమోదయ్యాయి. 2026లో ఇప్పటివరకు ఈ సంఖ్య 23,747కు చేరింది. ముఖ్యంగా దొంగతనాలు, మోసాలు, రోడ్డు ప్రమాదాలు, గాయపరిచే ఘటనలు పెరిగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.2026లో ఇప్పటివరకు 2,196 దొంగతనాల కేసులు నమోదయ్యాయి. 2024లో 1,484, 2025లో 1,662 కేసులు నమోదయ్యాయి. మోసాల కేసులు 2024లో 2,404 ఉండగా, 2025లో 2,636, 2026లో 2,789కు పెరిగాయి. గాయపరిచిన ఘటనలు 2024లో 1,311 నుంచి 2026లో 1,797కు చేరాయి. రోడ్డు ప్రమాద మరణాలు 2024లో 308, 2025లో 270 ఉండగా, 2026లో ఇప్పటివరకు 340 నమోదయ్యాయి. హత్యలు 2024లో 40, 2025లో 45, 2026లో 41గా ఉన్నాయి. కిడ్నాప్ కేసులు 2026లో 365కు చేరాయి. ఈ నేపథ్యంలో నేరాల నియంత్రణ, దర్యాప్తు, సొత్తు రికవరీపై పోలీసులు మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. నేరాల గణాంకాలను విశ్లేషించి, పెరుగుతున్న నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీజీపీ అధికారులకు సూచించారు. కమిషనరేట్ పునర్వ్యవస్థీకరణతో కొన్ని పోలీసు స్టేషన్ల పరిధులు మారాయని, సిబ్బంది కేటాయింపుల్లోనూ మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. నిందితులు ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లు గుర్తిస్తే, సంబంధిత బృందాలు వెంటనే వెళ్లి వారిని పట్టుకునేలా అవసరమైన అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని సూచించారు. ఎస్‌ఓటీ బృందాలు స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల మరణాలపై డీజీపీ ఆరా తీశారు. కీసర, చర్లపల్లి, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో గత ఏడాదితో పోలిస్తే ప్రమాద మరణాల సంఖ్య పెరిగినట్లు అధికారులు వివరించారు. ద్విచక్రవాహన ప్రమాదాలు సుమారుగా 25% అధికంగా ప్రాణనష్టానికి కారణమవుతున్నాయని పేర్కొంటూ, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని డిజిపి సూచించారు. విజయవాడ-వరంగల్ మార్గం, ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాల్లో పెట్రోలింగ్ వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. కమిషనరేట్ పరిధిలో ప్రతిరోజూ సుమారు 10 నుంచి 11 సైబర్, వైట్ కాలర్ నేరాల కేసులు నమోదవుతున్నట్లు అధికారులు తెలిపారు. సైబర్ నేరాల దర్యాప్తులో నైపుణ్యం పెంచేందుకు అవసరమైన సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని డిజిపి సూచించారు. డ్రగ్స్ నియంత్రణలో భాగంగా సరూర్‌నగర్‌లో ఈగల్ పోలీసు స్టేషన్ ఉపయోగించుకోవాలని డిజిపి సూచించారు. కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసిన అధికారులను గుర్తించి ప్రోత్సాహకాలు, రివార్డులు అందించాలని చెప్పారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు రౌడీషీటర్లు, సంఘవిద్రోహ శక్తులపై నిఘా కొనసాగించాలని, వివిధ ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.కమిషనరేట్ పునర్వ్యవస్థీకరణ అనంతరం మల్కాజిగిరికి 235 పోస్టులు రావాల్సి ఉన్నట్లు సీపీ సుమతి వివరించారు.సమావేశంలో డీసీపీలు , ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# బీమా బంద్ తో రోడ్డునపడ్డ మూడువేల రైతు కుటుంబాలు

సిద్దిపేట, అక్టోబర్ 15 :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూ కేసీఆర్ అమలు చేసిన రైతు సంక్షేమ కార్యక్రమాలను నిలిపివేస్తున్నడని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. దేశం మెచ్చిన రైతు బీమా పథకాన్ని నిలిపివేసి రైతు కుటుంబాల ఉసురు పోసుకుంటున్నరని ఆగ్రహం వ్యక్తం చేసారు. సిద్దిపేటలో రైతు బీమా అందని 22 మంది రైతు కుటుంబాలతో క్యాంపు ఆఫీసు వేదికగా హరీశ్ రావు సమావేశమయ్యారు. వారితో కలిసి భోజనం చేసిన హరీశ్ రావు ఆయా కుటుంబాల స్థితిగతుల గురించి తెలుసుకున్నారు. రైతు బీమా పథకం కింద రూ.5లక్షల సాయం అందకపోవడం వల్ల ఎదుర్కొంటున్న సమస్యల గురించి హరీశ్ రావుకు వారు వివరించారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ రైతు కుటుంబాల ఆవేదన చూస్తే మనస్సు చలించి పోతున్నదన్నారు. ఆగస్టు 15 నుంచి ఈరోజు వరకు ఒక్క సిద్దిపేటలోనే 22మంది రైతులు చనిపోయారు.రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3వేల మంది రైతులు చనిపోయారు. రైతు బీమా నిలిపివేయడం వల్ల ఇప్పుడు ఆ మూడు వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి.రేవంత్ రెడ్డి కేసీఆర్ అమలు చేసిన పథకాలు కొనసాగిస్తున్నాం అని మాటలు చెప్పారు కానీ నిజానికి అన్నీ బంద్ చేస్తున్నారు. రైతు బీమా పథకం అమలు చేసి ఉంటే ఇంతమంది రైతు కుటుంబాలు ఎందుకు కన్నీళ్లు పెడుతున్నాయి.. వీరందరికి ఎందుకు రూ.5లక్షలు రాలేదు. ఆగస్టు 14 నుంచి ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించకపోవడం వల్ల రాష్ట్రంలో రైతు బీమా ఆగిపోయింది. ఇక్కడ కన్నీరు మున్నీరు అవుతున్న బాధితులకు మీరేం సమాధానం చెబుతారు? వీరిని ప్రభుత్వం ఎలా ఆదుకుంటుందో చెప్పాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి, తుమ్మల వీరి బాధను ఎలా తీరుస్తారు? తుమ్మల నాగేశ్వరరావు ప్రాథమికంగా రైతు, మీరైనా ప్రీమియం చెల్లించాలని చెప్పాలి కదా. కొత్త పథకం తెస్తాం అని బడ్జెట్ లోచెప్పారు. ఆ పథకం ఇప్పటికీ అతీగతీ లేదు. గుంట భూమి వున్నా కేసీఆర్ పథకం వర్తింప చేసారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి పథకం వర్తింపచేసారు. మీరు చెప్పే పథకం ఇంటి యజమానికి మాత్రమే. ఐక్య రాజ్య సమితి సైతం మెచ్చుకున్న రైతు బీమా పథకాన్ని నిలిపివేసేందుకు మనసెలా వచ్చిందంటూ రేవంత్రెడ్డిని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాలు మన పథకాన్ని చూసి అమలు చేస్తున్నా మీరు మాత్రం బంద్ చేసారు, ఏ కారణంతో చనిపోయినా రైతు కుటుంబం రోడ్డున పడొద్దని కేసీఆర్ రైతు బీమా అనే పథకానికి 2018లో రూపకల్పన చేసిండు. రైతుల తరపున ప్రభుత్వమే ఏటా రూ.1400 కోట్ల ప్రీమియం ఎల్ఐసీకి చెల్లించి రూ.5 లక్షల భరోసా కల్పించిందు. 2018-19 నుంచి 2023-24 వరకు వివిధ కారణాలతో మరణించిన 1,38,688 మంది రైతు కుటుంబాలకు రూ.7వేల కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించింది. రైతు సంక్షేమం గురించి గొప్పలు చెప్పే రేవంత్ రెడ్డి.. ప్రీమియం రూ.1400 కోట్లు చెల్లించే తెలివి లేదా? వెంటనే రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా రైతు కుంటుంబాలకు చెల్లించాలని, యదావిదిగా రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తే మీరు 8 గంటలు కూడా ఇవ్వడం చేతకావడం లేదు. ఐఎఎస్, అధికారులను సస్పెండ్ చేస్తాం అని ఎవరి చెవిలో పువ్వులు పెడుతున్నారు. సస్పెండ్ చేయాల్సింది మిమ్మల్ని. 9 నెలల నుంచే ఎల్ నినో ఎఫెక్ట్ ఉంటుందని చెబుతుంటే ఏం చేసారు?కరెంట్ సరఫరా చేయకపోవడం మీ చేతగాని తనం కాదా? విద్యుత్ అధికారులను బాధ్యులుగా చేసి ఎందుకు వారిపై చర్యలు తీసుకుంటు న్నారు. నీళ్లు ఉన్నా లిఫ్ట్ చేయలేదు, పంట పొలాలకు నీళ్లు ఇవ్వలేదు. బొగ్గు నిల్వలు పెట్టుకోక కరెంట్ కోతలకు కారణం అయ్యారు. అధికారుల తప్పు కాదు ఇది, ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ఫెయిల్ అయ్యారు. మీ చేతగాని తనంతో విద్యుత్ అధికారులపై వేటు వేస్తారా?ప్రభుత్వం దిగిరాకపోతే రైతు కుటుంబాలతో కలిసి సీఎం ఇల్లు, సచివాలయం ముట్టడిస్తాం అని హెచ్చరిస్తున్నామన్నారు. రైతు కుటుంబాలు ఆందోళన చెందవద్దు.. బిఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుంది.. అసెంబ్లీ వేదికగా రైతు బీమాపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం.. మీకు బీమా డబ్బులు వచ్చేలా చేస్తామని హరీష్‌రావు హామీ ఇచ్చారు.



# యాదాద్రి ప్లాంట్ సీఈపై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్, అక్టోబర్ 15:

తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. విధుల్లో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలతో ప్లాంట్ చీఫ్ ఇంజనీర్ సురేష్ నాయక్‌ను సస్పెండ్ చేసింది. మరోవైపు నిర్మాణ పనులను వేగవంతం చేసి, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు ఐదుగురు ఐఏఎస్ అధికారులను క్యాంప్ ఆఫీసర్లుగా నియమించింది. పనుల పురోగతి, నాణ్యత విషయంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**ప్లాంట్ పనులపై ప్రత్యేక పర్యవేక్షణ**

నల్గొండ జిల్లా దామరచర్లలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనుల పురోగతిని ప్రభుత్వం సమీక్షించింది. నిర్మాణంలో జాప్యం, పనుల నిర్వహణలో లోపాలపై దృష్టి సారిస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంది. అక్టోబర్ 14న సాధారణ పరిపాలన శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఐదుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. వీరు ప్లాంట్ ప్రాంగణంలోనే ఉంటూ సివిల్ పనులు, బొగ్గు సరఫరా మార్గాలు, విద్యుత్ తరలింపు కోసం గ్రిడ్ అనుసంధానం, కాంట్రాక్టు సంస్థల పనితీరును నిరంతరం సమీక్షించనున్నారు.

**విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం అప్రమత్తం**

రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ పెరగడం, సరఫరాలో అంతరాయాలు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. ప్లాంట్ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులో ఉత్పత్తిని ప్రారంభించడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా అధికారులకు బాధ్యతలు అప్పగించింది. వేసవిలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, టీజీఈఆర్‌సీ మార్గదర్శకాలకు అనుగుణంగా సంస్థలు సిద్ధంగా ఉండాలని సూచించారు. డిస్కంలకు నిధుల కొరత రాకుండా చర్యలు తీసుకుంటూనే విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి సారించారు. యాదాద్రి ప్లాంట్ పనుల పర్యవేక్షణకు ఐఏఎస్ అధికారులను రంగంలోకి దించడం, నిర్లక్ష్యంపై సస్పెన్షన్ వేటు వేయడం ద్వారా ప్రభుత్వం అధికారులకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. ఈ చర్యలు ప్లాంట్ నిర్మాణాన్ని ఎంతవరకు వేగవంతం చేస్తాయి, రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఎంతమేరకు దోహదపడతాయన్నది కీలకంగా మారింది.

# భార్య ఘాతుకం!

- నిద్రలోనే భర్తపై పెట్రోల్ పోసి నిప్పు..
- వివాహేతర సంబంధం అనుమానంతో రగిలిన కుటుంబ కలహాలు
- నారాయణపేట జిల్లా మద్వార్ గ్రామంలో దారుణ ఘటన

నారాయణపేట, అక్టోబర్ 15 : వివాహేతర సంబంధం నేపథ్యంలో తలెత్తిన కుటుంబ కలహాలు ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొన్నాయి. భర్త మరో మహిళతో సంబంధం కొనసాగిస్తున్నాడన్న ఆగ్రహంతో నిద్రిస్తున్న అతడిపై భార్య పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. తీవ్ర కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాధితుడు మృతి చెందాడు. ఈ దారుణ ఘటన నారాయణపేట జిల్లా మరికల్ మండలం మద్వార్ గ్రామంలో చోటుచేసుకుంది. మృతుడి మరణ వాంగ్మూలం, ఇతర సాక్ష్యాధారాల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితురాలిపై కేసు నమోదు చేశారు. మరికల్ మండలం మద్వార్ గ్రామానికి చెందిన బాల స్వామి (46), తెలపల్లి రాములమ్మ దంపతులకు 28 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే బాలస్వామి అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న విషయం భార్యకు తెలియడంతో కుటుంబంలో విభేదాలు మొదలైనట్లు సమాచారం. ఈ విషయమై రాములమ్మ పలుమార్లు భర్తను నిలదీసినట్లు తెలిసింది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సెప్టెంబర్ 24న రాత్రి బాలస్వా మి ఇంట్లో నిద్రిస్తుండగా ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలి పారు. వ్యవసాయ పనుల కోసం ఇంట్లో నిల్వ ఉంచిన పెట్రోల్‌ను రాములమ్మ భర్తపై పోసి నిప్పంటించినట్లు ఆరోపిస్తున్నారు. ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో బాలస్వామి తీవ్ర కాలిన గాయాలకు గురయ్యాడు. అతడి కేకలు విన్న స్థానికులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వెంటనే చికిత్స కోసం మహబూబ్‌నగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. బాలస్వామికి తీవ్ర కాలిన గాయాలు కావడంతో పరిస్థితి విషమించింది. మె రుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ ప్రాణాలు దక్కలేదు. సెప్టెంబర్ 25న చికిత్స పొందుతూ బాలస్వామి మృ తి చెందాడు. దీంతో ఇద్దరు కుమారులు తండ్రిని కోల్పోయారు. ఈ ఘటన మద్వార్‌లో విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై డీఎ స్పీ నల్లపు లింగయ్య వివరాలు వెల్లడించారు. బాలస్వామి ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో అతడి నుంచి మరణ వాంగ్మూలం సేకరించినట్లు తెలిపారు. ఆ వాంగ్మూలంతోపాటు ఇతర సాక్ష్యాధారాల ఆధారంగా రాములమ్మను విచారించగా, ఆమె నేరాన్ని అంగీకరించినట్లు పేర్కొన్నారు. నిందితురాలిపై భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

**కుటుంబ కలహం చివరకు ప్రాణాంతకం**

వివాహేతర సంబంధం నేపథ్యంలో మొదలైన భార్యాభర్తల మధ్య విభేదాలు చివరకు హత్య కేసుగా మార చర్చనీయాంశమైంది. కుటుంబంలో నెలకొన్న వివాదం ఇద్దరు కుమారులు తండ్రిని కోల్పోయే పరిస్థితికి దారితీసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, సాక్ష్యాధారాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసులో తదుపరి చట్టపరమైన చర్యలు దర్యాప్తు ఆధారంగా చేపట్టనున్నారు.

# కూకట్‌పల్లి నాలాపై హైడ్రా ఫోకస్

- ఆక్రమణలు తొలగించి విస్తరించాలని రంగనాథ్ ఆదేశం!




హైదరాబాద్, అక్టోబర్ 15 :

హైదరాబాద్ నగర పరిధిలోని హుస్సేన్ సాగర్‌లోకి భారీగా వరద, మురుగునీటిని మోసుకొచ్చే కీలకమైన కూకట్‌పల్లి నాలాపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ప్రత్యేక దృష్టి సారించింది. నాలా పరివాహక ప్రాంతాలైన ఫతేనగర్‌బాలానగర్ పారిశ్రామిక, నివాస ప్రాంతాల్లో ఎదురవుతున్న వరద ముప్పునకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు నాలా ఆక్రమణలను తొలగించి విస్తరణ పనులు చేపడుతున్నట్లు ప్రకటించింది. ఈ ప్రక్రియలో పేదల నివాసాల జోలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టంగా ఆదేశించారు. గురువారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో సీఎంసీ, ఎంఎంసీ, పారిశ్రామిక వాడ కోఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు, ఐలా అధికారులతో కమిషనర్ ఏవీ రంగనాథ్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఫతేనగర్ ప్రాంతంలో సుమారు 40 మీటర్ల వెడల్పు ఉండాల్సిన నాలా, ఆక్రమణల కారణంగా కొన్ని ప్రాంతాల్లో కేవలం 9 మీటర్లకు కుంచించుకుపోయిందని అధికారులు కమిషనర్ దృష్టికి తెచ్చారు. సికింద్రాబాద్ ప్యాట్నీ నాలా విస్తరణ తరహాలోనే ఫతేనగర్ వద్ద కూడా పరికిచెరువు, ఐడీఎల్ చెరువుల నుంచి వచ్చే వరద నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా నిరోధక చర్యలు చేపట్టాలని సూచించారు. అర్ధగంట వర్షం కురిసినా పారిశ్రామిక ప్రాంతాలు జలమయమవుతున్నాయని పారిశ్రామికవేత్తలు ఆవేదన వ్యక్తం చేయగా, నాలా విస్తరణ పనులకు తాము పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తూ నాలా హద్దులు గుర్తించి, ఆక్రమణల తొలగింపుకు తక్షణ చర్యలు తీసుకోవాలని రంగనాథ్ అధికారులకు మార్గదర్శనం చేశారు.

# పండగల వేళ నిరసనలతో వ్యాపారులకు నష్టం

- దీపావళి వరకు ఆందోళనలకు అనుమతివ్వొద్దని అమిత్ షాకు వ్యాపార సంఘం లేఖ
- అక్టోబర్ 16న కన్నాట్ ప్లేస్‌లో సీజేపీ నిరసన
- అక్టోబర్ 10 ఆందోళనతో రూ.2,000 కోట్ల నష్టం
- ఢిల్లీలో 20 లక్షల మంది వ్యాపారులపై ప్రభావం పడే అవకాశం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 15:**

వరుస నిరసనలు, ప్రదర్శనలతో పండగల సీజన్‌లో వ్యాపారాలు దెబ్బతింటున్నాయని ఢిల్లీలోని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దసరా, దీపావళి సమయంలో రాజకీయ పార్టీల ఆందోళనల వల్ల మార్కెట్లకు వినియోగదారుల రాక తగ్గుతోందని పేర్కొంటున్నారు. దీపావళి ముగిసే వరకు రాజధానిలో నిరసనలు, ప్రదర్శనలకు అనుమతివ్వవద్దని కోరుతూ ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాసింది.

అక్టోబర్ 16న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కన్నాట్ ప్లేస్‌లో నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో వ్యాపార సంఘం ఈ అంశాన్ని లేవనెత్తింది. ఈ ఆందోళనతో కన్నాట్ ప్లేస్, జన్‌పథ్, ఖాన్ మార్కెట్ వంటి ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే ప్రమాదం ఉందని సీటీఐ పేర్కొంది. రహదారులు దిగ్బంధమైతే వినియోగదారులు షాపింగ్‌కు రావడం తగ్గుతుందని, తద్వారా వ్యాపారాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేసింది.

**రూ.2,000 కోట్ల నష్టం అంచనా**

అక్టోబర్ 10న జరిగిన సీజేపీ నిరసనల కారణంగా ఢిల్లీలో లాక్‌డౌన్ తరహా పరిస్థితులు ఏర్పడ్డాయని సీటీఐ తెలిపింది. ఆ రోజు మార్కెట్లకు వినియోగదారుల రాక తగ్గడంతో సుమారు రూ.2,000 కోట్ల మేర వ్యాపార నష్టం వాటిల్లినట్లు అంచనా వేసింది. నవరాత్రులు, దీపావళి వంటి కీలక పండగల సమయంలో ఇలాంటి ఆందోళనలు కొనసాగితే వ్యాపారాలపై మరింత ప్రభావం పడుతుందని పేర్కొంది.

ఢిల్లీలో సుమారు 20 లక్షల మంది వ్యాపారుల జీవనోపాధిపై నిరసనల ప్రభావం పడే అవకాశం ఉందని సీటీఐ ఆందోళన వ్యక్తం చేసింది. పండగల సీజన్‌లో మార్కెట్లకు వచ్చే వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా, వ్యాపార కార్యకలాపాలు సజావుగా సాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంమంత్రిని కోరింది.

# 2.50 లక్షల లంచం

- ఏసీబీ వలలో డిప్యూటీ తహసీల్దార్!
- భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు రూ.5 లక్షల డిమాండ్
- డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డితోపాటు మరో ఇద్దరు పట్టివేత
- వీఆరఏ విజయ్‌కుమార్, రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణ అదుపులోకి

**కీసర, అక్టోబర్ 15 :**

భూమికి సంబంధించిన సమస్యను పరిష్కరించేందుకు రూ.5 లక్షల లంచం డిమాండ్ చేసిన డిప్యూటీ తహసీల్దార్ అవినీతి నిరోధక శాఖ అధికారుల వలకు చిక్కారు. నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న వ్యవసాయ భూమిని తొలగించేందుకు బాధితుడి నుంచి తొలి విడతగా రూ.2.50 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కీసర మండల డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డితోపాటు ఆయనకు సహకరించిన వీఆరఏ విజయ్‌కుమార్, రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణలను అదుపులోకి తీసుకున్నారు. గురువారం జరిగిన ఈ ఘటన రెవెన్యూ శాఖలో కలకలం రేపింది. కేసుకు సంబంధించిన వివరాలను రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ వెల్లడించారు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. కీసర మండలానికి చెందిన ఓ వ్యక్తి వ్యవసాయ భూమి నిషేధిత ఆస్తుల జాబితాలోని 22ఏ కింద నమోదైంది. దీంతో తన భూమిని ఆ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ బాధితుడు కీసర తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. సమస్య పరిష్కారం కోసం చాలాకాలంగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. తహసీల్దార్‌తోపాటు డిప్యూటీ తహసీల్దార్‌ను కలిసి తన సమస్యను వివరించి పరిష్కరించాలని కోరాడు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలంటే రూ.5 లక్షల లంచం ఇవ్వాలని డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డి డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. అంత పెద్ద మొత్తాన్ని ఒకేసారి చెల్లించే స్థోమత లేదని బాధితుడు చెప్పడంతో విడతలవారీగా డబ్బులు ఇచ్చేలా మాట్లాడుకున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో తొలి విడతగా రూ.2.50 లక్షలు చెల్లించేందుకు నిర్ణయించిన బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. జరిగిన విషయాన్ని వారికి వివరించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పథకం ప్రకారం వల పన్నారు. గురువారం డిప్యూటీ తహసీల్దార్‌కు తొలి విడతగా రూ.2.50 లక్షలు అందజేస్తున్న సమయంలో ఏసీబీ బృందం ఆకస్మికంగా దాడి చేసింది. లంచం స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఆయనకు సహకరించిన వీఆరఏ విజయ్‌కుమార్, రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. కీసర మండలానికి చెందిన ఓ వ్యక్తి తన వ్యవసాయ భూమిని 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించినట్లు తెలిపారు. బాధితుడు పలుమార్లు కార్యాలయానికి వెళ్లి అధికారులను కలిసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ తహసీల్దార్ రూ.5 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు అందిందని వివరించారు. అందులో భాగంగా తొలి విడతగా రూ.2.50 లక్షలు తీసుకుంటుండగా దాడి చేసి పట్టుకున్నామని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్‌తోపాటు ఆయనకు సహకరించిన విజయ్‌కుమార్, బాలకృష్ణలను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.



# మతం మారితే కుల రిజర్వేషన్ వర్తించదు: సుప్రీంకోర్టు

- ముస్లిం బీసీ రిజర్వేషన్లపై తమిళనాడు ప్రభుత్వానికి ఎదురుదెబ్బ
- మద్రాస్ హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం
- మత మార్పిడితో కుల గుర్తింపు స్వయంచాలకంగా రాదని స్పష్టీకరణ
- 2024లో తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన జీవోపై వివాదం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 15:**

మతం మారినంత మాత్రాన మరో సామాజిక వర్గానికి చెందిన కుల గుర్తింపు, రిజర్వేషన్ అర్హతలు స్వయంచాలకంగా లభించవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారిన వారికి ముస్లిం వెనుకబడిన తరగతుల (బీసీఎం) రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పించే అంశంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ వ్యవహారంలో తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కుల ఆధారిత సామాజిక గుర్తింపు, రిజర్వేషన్ అర్హతలకు సంబంధించి వర్తించే చట్టపరమైన నిబంధనల ప్రాముఖ్యతను ఈ సందర్భంగా కోర్టు స్పష్టం చేసింది.

**వివాదానికి కారణమైన జీవో**

తమిళనాడు ప్రభుత్వం 2024 మార్చిలో జారీ చేసిన జీవో ఈ వివాదానికి కారణమైంది. వెనుకబడిన తరగతులు (బీసీ), అత్యంత వెనుకబడిన తరగతులు (ఎంబీసీ), డీనోటిఫైడ్ కమ్యూనిటీలు (డీఎన్‌సీ), షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) నుంచి ఇస్లాంలోకి మారిన వారు ముస్లిం వెనుకబడిన తరగతుల (బీసీఎం) కేటగిరీలో కమ్యూనిటీ సర్టిఫికెట్లు పొంది రిజర్వేషన్ ప్రయోజనాలు పొందేందుకు ఈ ఉత్తర్వులు వీలు కల్పించాయి. అయితే, ఈ నిర్ణయం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ జీవోను రద్దు చేసింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

**మత మార్పిడితో కుల గుర్తింపు రాదు**

మతం మారినంత మాత్రాన వ్యక్తులు ఎదుర్కొంటున్న సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనం తొలగిపోదని తమిళనాడు ప్రభుత్వం వాదించింది. వెనుకబడిన తరగతుల కమిషన్ సిఫారసుల ఆధారంగానే జీవో జారీ చేశామని, ఇప్పటికే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందుతున్నవారు మత మార్పిడి కారణంగా వాటిని కోల్పోకూడదనే ఉద్దేశం ఉందని వివరించింది.

అయితే, తమిళనాడులో బీసీఎం కేటగిరీ కింద గుర్తించిన అన్సార్, దక్కనీ ముస్లింలు, దూదేకుల, లబ్బాయి, మాపిళ్ల, షేక్, సయ్యద్ వంటి ఏడు సామాజిక వర్గాల్లోకి మతం మారినంత మాత్రాన ఎవరూ స్వయంచాలకంగా చేరలేరని హైకోర్టు పేర్కొంది. ఆయా వర్గాల సామాజిక గుర్తింపునకు సంబంధించిన నిబంధనలను పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది.

**కమ్యూనిటీ సర్టిఫికెట్ కోసం పోరాటం**

2015లో హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారిన సమీర్ అహ్మద్ అనే వ్యక్తి, తనకు ముస్లిం లబ్బాయి సామాజిక వర్గానికి చెందిన కమ్యూనిటీ సర్టిఫికెట్ ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ ఆ దరఖాస్తును తిరస్కరించడంతో ఆయన మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంలోనే తమిళనాడు ప్రభుత్వం 2024లో జారీ చేసిన జీవో చట్టబద్ధతపై వివాదం తలెత్తింది. తాజాగా సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పును సమర్థించడంతో ఈ అంశంపై న్యాయపరమైన చర్చ మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది.

# సీజేపీ నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతి

- కన్నాట్ ప్లేస్ ఆందోళనను అడ్డుకునేందుకు కోర్టు నిరాకరణ
- శాంతిభద్రతలు కాపాడాలని ఢిల్లీ పోలీసులకు ఆదేశం
- అభిజిత్ దీప్కే పిలుపుతో అక్టోబర్ 16న నిరసన
- సీజేపీ కోకన్వీనర్లకు ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 15:**

ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టనున్న నిరసనను నిలిపివేయడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. అక్టోబర్ 16న జరగనున్న ఆందోళనను అడ్డుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ నిర్ణయం తీసుకుంది. నిరసనను నియంత్రించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు ఇచ్చిన హామీని ధర్మాసనం నమోదు చేసింది. సుప్రీంకోర్టు నిర్దేశించిన చట్టానికి అనుగుణంగా వ్యవహరించాలని పోలీసులను ఆదేశించింది.

పండగల సీజన్‌లో నిరసనల కారణంగా సెంట్రల్ ఢిల్లీలో దుకాణాలు మూతపడుతున్నాయని, దీంతో వ్యాపారులు నష్టపోతున్నారని కన్నాట్ ప్లేస్‌కు చెందిన వ్యాపారి తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఆందోళనలపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ స్పందిస్తూ.. సీజేపీ కార్యకలాపాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నామని, పిటిషనర్ ఆందోళనలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**అక్టోబర్ 16న సెంట్రల్ పార్క్‌లో నిరసన**

సీజేపీ కన్వీనర్ అభిజిత్ దీప్కే అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్ వద్ద నిరసనకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, జాతీయ జెండాలతో రావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఇటీవల జంతర్ మంతర్ వద్ద జాతీయ జెండాలతో నిరసన తెలుపుతున్న సీజేపీ కోకన్వీనర్లు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టు వారికి ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. జంతర్ మంతర్ వద్ద ఆంక్షలు అమల్లో ఉన్న నేపథ్యంలో ఈ అరెస్టులు జరిగినట్లు తెలుస్తోంది.




**జాతీయ జెండాపై కొనసాగుతున్న వివాదం**

తమ నేతల అరెస్టుల నేపథ్యంలో సీజేపీ కొత్త నిరసనకు పిలుపునిచ్చింది. జాతీయ జెండాను ప్రదర్శించినందుకు జైలుకు పంపిస్తారా? అంటూ సీజేపీతో పాటు వామపక్ష విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. మరోవైపు, కన్నాట్ ప్లేస్‌లో నిరసన సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది.

# భారత రక్షణ రంగానికి దశ-దిశ చూపిన మహనీయుడు

- అబ్దుల్ కలాంకు బీజేపీ చీఫ్ రామచందర్ రావు నివాళులు
- సాగునీరు, విద్యుత్ కొరతతో రైతుల అరిగోస
- పాలనను గాలికొదిలేసి వోట్ చోరీ డ్రామాలాడుతున్న కాంగ్రెస్

**హైదరాబాద్,అక్టోబర్ 15 :**

మాజీ రాష్ట్రపతి, దేశం గర్వించదగ్గ మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా భారతరత్న డాక్టర్ ఏ.పి.జె.అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మైనారిటీ మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించిన కలాం తన అసాధారణ ప్రతిభాపాటవాలతో భారత రాష్ట్రపతిగా, దేశ రక్షణ రంగంలో అత్యున్నత క్షిపణులు, రాకెట్ వ్యవస్థలను ఆవిష్కరించి జాతిని అగ్రరాజ్యాల సరసన నిలిపారని కొనియాడారు. హైదరాబాద్‌లోని డీఆర్‌డీవోలో పనిచేస్తూ దేశ రక్షణకు అవసరమైన ఎన్నో సాంకేతిక పరిజ్ఞానాలను అందించారని ఆయన గుర్తు చేశారు. వాజ్‌పేయి నాయకత్వంలో పోఖ్రాన్‌లో విజయవంతంగా నిర్వహించిన అణుపరీక్షలతో యావత్ ప్రపంచం భారతదేశ సత్తాను గుర్తించి ఆశ్చర్యపోయిందన్నారు. అయితే దేశ గౌరవాన్ని పెంచిన అబ్దుల్ కలాంను, అణుపరీక్షలను సైతం కాంగ్రెస్ పార్టీ కించపరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు పార్లమెంటు వేదికగా సోనియా గాంధీ, చిదంబరం లాంటి నేతలు కలాంను 'బాంబ్ మ్యాన్' అంటూ హేళన చేస్తూ మాట్లాడిన రికార్డులు ఉన్నాయన్నారు. నేటి యువత అబ్దుల్ కలాం నిస్వార్థ దేశ భక్తిని ఆదర్శంగా తీసుకుని నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



**దివ్యాంగులకు కేంద్రం చేయూత**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం నాటి కేంద్ర మంత్రివర్గ సమావేశం ఉద్యోగులు, దివ్యాంగుల సంక్షేమం కోసం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని రామచందర్ రావు తెలిపారు. రైల్వే శాఖలోని 11.4 లక్షల మంది ఉద్యోగులకు 78 రోజుల ఉత్పాదక ఆధారిత బోనస్ కింద రూ.2,009.61 కోట్లు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అంతేకాక జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం కింద గతంలో 80 శాతంగా ఉన్న వైకల్య అర్హత ప్రమాణాన్ని 40 శాతానికి తగ్గించడం ద్వారా లక్షలాదిమంది దివ్యాంగులకు చేయూతనిచ్చిందని పేర్కొన్నారు.

# న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు: సీజేఐ

- రాహుల్‌గాంధీ పిటిషన్ విచారణలో సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు
- సుప్రీంకోర్టు ప్రాంగణం వరకు పాదయాత్రపై గౌరవ్ భాటియా అభ్యంతరం
- ఒత్తిళ్లకు న్యాయవ్యవస్థ తలొగ్గదన్న ప్రధాన న్యాయమూర్తి
- జంతర్ మంతర్ నిరసనలపై పిటిషన్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 15:**

న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. న్యాయస్థానాలపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. 'సర్' రద్దు చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. సుప్రీంకోర్టు ప్రాంగణం వరకు రాహుల్‌గాంధీ పాదయాత్రగా రావడంపై సీనియర్ న్యాయవాది గౌరవ్ భాటియా అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ అంశం చర్చకు వచ్చింది.

**ఒత్తిళ్లకు తలొగ్గబోం**

సుప్రీంకోర్టు ప్రాంగణంలో రాజకీయ ఊరేగింపులు నిర్వహించడం ఆమోదయోగ్యం కాదని గౌరవ్ భాటియా అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యలు న్యాయవ్యవస్థపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నాలుగా మారవచ్చని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీజేఐ సూర్యకాంత్.. న్యాయవ్యవస్థ వాస్తవ ప్రపంచానికి దూరంగా లేదని, బయట జరుగుతున్న పరిణామాలన్నీ తమకు తెలుసని అన్నారు. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని, ఇలాంటి ప్రయత్నాలు బలహీనమైనవని వ్యాఖ్యానించారు.

**జంతర్ మంతర్ అంశంపై నోటీసులు**



మరోవైపు, ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన ప్రదేశాల జాబితా నుంచి తొలగించిన అంశం కూడా సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు జంతర్ మంతర్‌ను జాబితా నుంచి తొలగించలేదని, ఒక కమిటీ ఆ మేరకు సిఫారసు చేసిందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. జంతర్ మంతర్‌ను నిరసన ప్రదేశాల జాబితా నుంచి తొలగిస్తూ ఢిల్లీ పోలీసులు జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. తొలుత ప్రభుత్వం స్పందనను పరిశీలిస్తామని, ఆ సమాధానంతో సంతృప్తి చెందకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ధర్మాసనం పేర్కొంది.

# ప్రగతి రిసార్ట్స్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**కుటుంబ సమేతంగా పాల్గొన్న ఉద్యోగులు, విల్లా యజమానులు...**



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మండల పరిధి లోని ప్రగతి రిసార్ట్స్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉద్యోగుల, విల్లా యజమానులు తమ తమ కుటుంబాలతో కలిసి ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో సాగాయి. అందరు కలిసి బతుకమ్మ పండుగను జరుపుకోవడంతో ప్రగతి రిసార్ట్స్ ప్రాంగణంలో పండుగ సందడి నెలకొంది. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విల్లా యజమానుల మధ్య ఆత్మీయత, ఐకమత్యం వెల్లివిరిశాయి. ఈ వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చిన సంస్థ చైర్మన్ డాక్టర్ జి.బి.కె. రావు, మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ చంద్ర, ఫైనాన్స్ డైరెక్టర్ జి.వి. కుమారి, డైరెక్టర్ (పి అండ్ ఏ) ఎం. రామకృష్ణలకు ప్రగతి టీమ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.బతుకమ్మ పండుగను అందరూ కలిసి జరుపుకోవడం మధురమైన అనుభూతిని అందించిందని, ఈ సాంస్కృతిక వేడుక విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ప్రగతి టీమ్ పేర్కొంది.

# బ్యాతల శివ శంకర్ మాదిగకు ఘన నివాళులు అర్పించిన మందకృష్ణ మాదిగ

**కుటుంబాన్ని పరామర్శించి, అండగా ఉంటానని హామీ...**




**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి, నిబద్ధత కలిగిన వ్యక్తి బ్యాతల శివశంకర్ మాదిగ ఇటీవల ఆకస్మికంగా గుండెపోటుతో మరణించడం జరిగింది. ఈ సందర్భంగా గురువారం ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలంలోని టంగటూరు గ్రామంలోని మృతుని నివాసానికి వెళ్లి శివశంకర్ మాదిగ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. శివశంకర్ మాదిగ కుటుంబ సభ్యులను ఓదార్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.తన మృతికి సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి భరోసా కల్పిస్తూ ధైర్యం చెప్పాడు. తల్లిదండ్రులను, భార్యా పిల్లలను ఓదార్చి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో క్రియాశీలకంగా కష్టపడ్డ శివశంకర్ మాదిగ మృతి చెందడం చేవెళ్ల ప్రాంతంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ, ఎమ్ఎస్ పి జిల్లా మాజీ అధ్యక్షులు రావుగళ్ళ బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు పెంటనోళ్ల నర్సింహా మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కాడిగాళ్ల ప్రవీణ్ కుమార్ మాదిగ, శంకర్ పల్లి మండల అధ్యక్షుడు లింగం సాయి మాదిగ, చేవెళ్ల మండల అధ్యక్షులు మల్లేష్ మాదిగ, మొయినాబాద్ మండల అధ్యక్షులు కుమార్ మాదిగ, షాబాద్ అధ్యక్షులు ముల్కి ప్రవీణ్ మాదిగ తదితరులు హాజరయ్యారు.

# సూర్యాపేటలో రోబోటిక్ కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలకు శ్రీకారం




**ఉమ్మడి నల్గొండ జిల్లాలో తొలిసారిగా రోబోటిక్ కీళ్ల మార్పిడి సేవలు**

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** ఉమ్మడి నల్గొండ జిల్లా వైద్య రంగంలో మరో కీలక ముందడుగు పడింది.సూర్యాపేటలోని మన అమ్మ హాస్పిటల్‌లో అత్యాధునిక రోబోటిక్ సాంకేతికతతో కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన రోబోటిక్ వ్యవస్థను డా.రామకృష్ణ,డా.విజయలక్ష్మి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి అధినేతలు డా.సుధీర్ కుమార్,డా.స్వరూప లక్ష్మి మాట్లాడుతూ ఆధునిక వైద్య సాంకేతికతను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు.రోబోటిక్ సాంకేతికతతో కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల్లో మరింత ఖచ్చితత్వాన్ని సాధించడంతోపాటు,రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.రోబోటిక్ కీళ్ల మార్పిడి సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించడంలో మన అమ్మ హాస్పిటల్ మరో ముందడుగు వేసింది.ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డా.రంగారెడ్డి,డా.రమేష్ (ఐఎంఏ అధ్యక్షుడు), డా. రామ్మూర్తి, డా. చంద్రశేఖర్,బంధు వీరయ్య,బంధు శ్రీధర్,తొగరు మల్లికార్జున,ఇజ్రాయిల్‌తో పాటు వివిధ సంఘాల సభ్యులు, కుటుంబ సభ్యులు,ఆసుపత్రి వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి పెద్దపీట.. వలిగొండలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల అందజేత



**వలిగొండ. రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని దేవీశ్రీ గార్డెన్స్‌లో ఈ రోజు నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్, కళ్యాణలక్ష్మి–షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన పేద కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించడం ద్వారా ఆహార భద్రతకు భరోసా కల్పించడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సులభంగా పొందేందుకు వీలవుతుందని తెలిపారు. అదేవిధంగా, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పేద కుటుంబాలు తమ ఆడపిల్లల వివాహాల విషయంలో ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 68 మంది అర్హులైన లబ్ధిదారులకు మొత్తం ₹68,07,888 విలువైన కళ్యాణలక్ష్మి–షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో PACS చైర్మన్ గరిసె రవి , స్థానిక వలిగొండ సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని సహదేవ్ గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్, డైరెక్టర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ,మాజీ ప్రజాప్రతినిధులు,గ్రామ సర్పంచులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నినో ప్రభావంపై మండల స్థాయి అధికారుల అత్యవసర సమావేశం

- మండల ప్రత్యేక అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సురేష్ బాబు అధ్యక్షతన భేటీ
- రాబోయే 3 నెలల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చ...
- నేడు గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు ఏర్పాటుకై పంచాయతీ కార్యదర్శులకు ఆదేశం




**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** రాబోయే రోజుల్లో సూపర్ ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండబోతున్న నేపథ్యంలో శంకర్ పల్లి మండలంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గురువారం రోజు మండల ప్రత్యేక అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సురేష్ బాబు అధ్యక్షతన మండల స్థాయి అధికారుల అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు – మండల వ్యవసాయ అధికారి, మండల పంచాయతీ అధికారి, ఎలక్ట్రిసిటీ ఏఈ, ఆర్ అండ్ బి ఏఈ, వెటర్నరీ డాక్టర్, ఏపీఎం ఐకేపీ, ఏపీఓ ఈ.జీ. ఎస్ తో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓ లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఐకేపీ సీసీలు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ... "సూపర్ ఎల్ నినో ప్రభావం రాబోయే మూడు నెలల్లో ఏ విధంగా ఉండబోతుంది, వాతావరణంలో వచ్చే మార్పులు, వర్షాభావ పరిస్థితులు, పంటలపై దాని ప్రభావం" అనే అంశాలపై విపులంగా వివరించారు. దీనిని ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన ముందస్తు చర్యల గురించి అధికారులకు దిశానిర్దేశం చేయడం జరిగింది. రైతులను అప్రమత్తం చేయడం, తాగునీటి ఎద్దడి రాకుండా చూడడం, పశువులకు గ్రాసం, నీటి కొరత రాకుండా చర్యలు తీసుకోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడడం వంటి అంశాలపై ప్రతి శాఖ వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

**నేడు అన్ని గ్రామాల్లో గ్రామ సభలు...**

ఇదే విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రేపు అనగా అక్టోబర్ 16, 2026 నమండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభలు ఏర్పాటు చేయాలని సంబంధిత సర్పంచులను కోరుతూ, అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించడం జరిగింది.ప్రతి గ్రామంలో సూపర్ ఎల్ నినో పై ప్రజలకు అవగాహన కల్పించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు.

# వివేకానంద కాలనిలో ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

**ప్రత్యేక పూజలు చేసిన మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు బద్దం శశిధర్ రెడ్డి**



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి వివేకానంద కాలనీలో ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలు కాలనీవాసులందరూ కలిసి ఘనంగా జరుపుకున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు అమ్మవారు మీనాక్షిదేవి రూపంలో దర్శనమిచ్చింది. శంకర్ పల్లి మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి చేతులు మీదుగా పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైతన్య కళాశాల కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి, కాలనీ వాసులు వీరారెడ్డి, రమేష్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సుధీర్, శేఖర్, సంజీవరెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# వర్షా లు లేక ఎండుతున్న పంటలు, ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

- తక్షణమే కంటింజెన్సీ ప్లాన్ ప్రకటించాలి...
- బిఆర్ఎస్ నేత బ్యాగరి సుదర్శన్



**చేవెళ్ళ, రాజముద్ర న్యూస్:** వర్షాలు లేక పంటలు ఎండిపోతూ రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని బిఆర్ఎస్ నేత బ్యాగరి సుదర్శన్ డిమాండ్ చేశారు. ఎల్‌నినో ముప్పును దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులకు ప్రత్యామ్నాయ తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల సాగుకు విత్తనాలను సబ్సిడీపై అందించాలని కోరారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, అందించడంతో పాటు పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల కష్టాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, పంటలు మరింత దెబ్బతినకముందే సమగ్ర కార్యాచరణ ప్రకటించి, అన్నదాతలను ఆదుకోవాలని బ్యాగరి సుదర్శన్ డిమాండ్ చేశారు.

# గంజాయి విక్రహిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన చేవెళ్ల పోలీసులు

**670 గ్రాముల గంజాయి స్వాధీనం, నిందితుడు అరెస్ట్**



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల లేబర్ అడ్డా వద్ద గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న కుందన్ కుమార్ (25), తండ్రి విజయ్ కుమార్, స్వస్థలం బీహార్ రాష్ట్రం, ప్రస్తుతం ముట్‌పూర్ గ్రామం, కొందుర్గ్ మండలం, రంగారెడ్డి జిల్లా నివాసిని చేవెళ్ళ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడు హైదరాబాద్‌లో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తు, అదనపు డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తన స్వగ్రామంలో చెందిన కామేశ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకువచ్చినట్లు విచారణలో వెల్లడైంది. షాద్‌నగర్, కొందుర్గ్ ప్రాంతాల్లోని కార్మికుల అడ్డాల వద్ద ఒక్కో ప్యాకెట్‌ను రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయించినట్లు విచారణలో తెలిసింది. ఈ క్రమంలో మిగిలిన గంజాయి ప్యాకెట్లను చేవెళ్ల లేబర్ అడ్డా వద్ద విక్రయించేందుకు వచ్చిన సమయంలో చేవెళ్ళ పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 670 గ్రాముల గంజాయిని, ఒక మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు.

# మున్సిపల్ 5వ వార్డులో తాగునీటి కోసం ప్రజల అవస్థలు

**మూడు రోజులుగా నల్లా నీళ్లు రాక తీవ్ర ఇబ్బందులు**



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మున్సిపల్ 5వ వార్డులో నీటి కొరత ఏర్పడడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వార్డు ప్రజలు వాపోతున్నారు. సంపు దగ్గర ఉన్న పైపు నుంచి నీళ్లు పట్టుకుంటూ తమ అవసరాలను తీర్చుకుంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం మహిళలు, గ్రామ ప్రజలు రోడ్డుకేక్కే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల నీటి కష్టాలు అధికారులకు కనిపించడం లేదా అని వార్డు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి, బుల్కాపూర్ 5వ వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించి, నల్లా నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

## సీఎంఆర్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే మదన్మోహన్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన సీఎంఆర్ చెక్కుల లబ్ధిదారులు ఒంటరి రాజయ్య కు 60000 వేలు, ఆరుగొండ లింబాద్రి 18000 వేలు, కాసర్ల మీనా 15000 వేలు, వారికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు గురువారం రోజున సీఎంఆర్ చెక్కులు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండి ప్రవీణ్, ఈసన్న పల్లి సర్పంచ్ డోకి లచ్చయ్య, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యగిరి బయో గ్యాస్ కంపెనీ కి భూమి పూజ నిర్వహించిన అతిరత్ గ్రూప్



**వలిగొండ. రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని నర్సాపురం గ్రామ పంచాయితీ ఆవాస గ్రామమైన పిసరి వారి గూడెంలో గురువారం అతిరద్ గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో నెలకొల్పబడిన మత్స్యగిరి బయోగ్యాస్ కంపెనీకి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బాలకృష్ణ మాట్లాడుతూ బయోగ్యాస్ కంపెనీని గ్రామీణ ప్రాంతంలో నెలకొల్పబడడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని దీని ద్వారా ఎంతో మంది రైతులకు లబ్ధి చేకూరడంతో పాటు గ్రామీణ యువతకు పట్టణాలకు వెళ్లకుండా ఉపాధి అవకాశాలు దొరుకుతాయని అన్నారు. ఈ యొక్క బయోగ్యాస్ కంపెనీలు తెలంగాణలో 25 ఆంధ్రాలో 25 నెలకొల్పేందుకు శ్రీకారం చుట్టామని మొట్టమొదటి బయోగ్యాస్ కంపెనీ మత్యాద్రి పుణ్యక్షేత్ర పరిధిలో ప్రారంభించడం శుభ సూచకమని అన్నారు. ఈ కార్యక్రమంలో భూమి యజమాని పిసరి వెంకట్ రెడ్డి, సాయికుమార్ , బాలకృష్ణ కేశవ్, సర్పంచ్ లు కావటి మంజుల ఉప్పలయ్య, సామ సరస్వతి రామ్ రెడ్డి, జక్కల వెంకటయ్య, కావటి లింగస్వామి, బంగపట్ల నరహరి,మంటపల్లి సుధాకర్ , పీసరి శ్రీనివాస్ రెడ్డి ,గ్రామ ప్రజలు యువత తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాతకు యజ్ఞం కుంకుమ పూజలు



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామంలో దుర్గ మాతకు యజ్ఞం, కుంకుమ పూజలు భక్తులు చేయించారు, దుర్గామాత వద్ద దాతలు యజ్ఞం మీద కూర్చున్న దాతలు మర్రి గౌతమి, ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి లావణ్య మల్లేష్ , సభ్యులు జిర్ల భాగ్య రవి, కందూరి పద్మ ,కుంట మల్లయ్య, జోగు లక్ష్మి శంకర్, జీర్ల సత్తవ్వ బీరయ్య, కందూరి రాజమణి రాజయ్య, శ్రీరామ్ కవిత రవి దుర్గామాత కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో పూజ నిర్వహించడం జరిగింది గ్రామస్తులు అక్కలు చెల్లెళ్లు కుకుమ పూజ, యజ్ఞం ఘనంగా చేశారు దిలీప్ పంతులు పూజా వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ సమభావన సంఘం భూమి పూజ చేసిన చిన్నం బీరప్ప



**ఆత్మకూర్( ఎం).రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం).మండలం ఉప్పలపహాడ్ గ్రామంలో ఆలేరు MLA అభివృద్ధి ప్రదాత ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహాయ సహకారాలతో మహిళా సమభావన సంఘం భవనానికి ముగ్గు పోయడం జరిగింది గ్రామ సర్పంచ్ చిన్నం బీరప్ప ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించడం జరిగినది ఇట్టి కార్యక్రమంలో సంఘ బంధం అధ్యక్షురాలు తీగల స్వప్న వార్డు సభ్యులు చిన్నం శ్రీనివాస్ పంచాయతీ రాజ్ AE మల్లేష్ , వర్క్స్ ఇన్స్పెక్టర్ బగ్గు ,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకుల బిక్షపతి మాజీ సర్పంచ్ లగ్గాని బాలరాజు , కొడిమల గోపాల్, కొడిమల సత్యనారాయణ ,లోడే శ్రీకాంత్ VOA మరియాల నాగభూషణం గ్రామస్తులు లోడ సుజాత గుండెల్లి జ్యోతి,గుమిడెల్లి భాగ్యమ్మ , లగ్గాని ఎల్లయ్య గ్రామపంచాయతీ సిబ్బంది కారోబార్ కడకంచి ఆంజనేయులు గుమ్మడెల్లి మారయ్య గుమ్మడెల్లి భాస్కర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా ఆదనపు కలెక్టర్ వెంకటాచారి**




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా పకడ్బందిగా నిర్వహించాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటా చారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారము కలెక్టరేట్ కార్యాలయ సమావేశము హాలు నందు తహసిల్దార్లు, డిప్యూటి తహసిల్దార్లు , రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు గ్రామా పంచాయతి అధికారులు, సర్వేయర్లుకు భూముల రి సర్వే పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వే కు సంబంధించి శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలనీ భూ సర్వే ప్రక్రియను నిర్దేశిత మార్గ దర్శకాల ప్రకారం చేపట్టాలని సూచించారు. భూముల రీ సర్వే నిర్వహణలో అనుసరించాల్సిన విధానాలు, తీసుకోవలసిన జాగ్రతలు, సంబంధిత రికర్డుల నిర్వహణ, క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలపై పలు సూచనలు చేశారు.సర్వే నిర్వహించే సమయంలో భూముల సరిహద్దులు విస్తీర్ణం, అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డులు, సంబంధిత వివరాలను క్షుణంగా పరిశీలించాలని సూచించారు. రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తూ బాద్యాత యుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక అంశాలు, విధి విధానాలపై పూర్తి అవగాహనా కలిగి ఉండాలని సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ ఎ డి మధుసూదన్, సంబంద్ధిత అధికారులు పాల్గొన్నారు.

# జూనియర్ సివిల్ జడ్జిగా మహాలింగాపురం బిడ్డ గండు మనీషా ఆనంద్ రెడ్డి

- హైకోర్టు ఫలితాల్లో సత్తా చాటిన శంకర్ పల్లి మహిళా...
- మహాలింగాపురం గ్రామానికి గర్వకారణం...
- గ్రామ సర్పంచ్ మాసన్నగారి రాఘవేందర్ రెడ్డి



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మండలంలోని మహాలింగాపురం గ్రామానికి చెందిన ఆడ బిడ్డ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. మహాలింగాపురం గ్రామానికి చెందిన గండు ఆనంద్ రెడ్డి సతీమణి గండు మనీషా ఆనంద్ రెడ్డి తెలంగాణ హైకోర్టు జూనియర్ సివిల్ జడ్జిగాఎంపికయ్యారు. తెలంగాణ హైకోర్టు ప్రకటించిన జూనియర్ సివిల్ జడ్జిల ఫలితాల్లో మనీషా ఆనంద్ రెడ్డి ప్రతిభ కనబరిచి ఎంపిక కావడం పట్ల గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. న్యాయవిద్యలో ఎంతో కష్టపడి చదివి, ఎన్నో వ్యయప్రయాసలకోర్చి జడ్జిగా ఎంపిక కావడం అంటే మామూలు విషయం కాదని, గ్రామంలోని ప్రతి ఆడబిడ్డలకు, యువతకు ఆమె ఆదర్శంగా నిలిచారని గ్రామ పెద్దలు, మండల ప్రజలు కొనియాడుతున్నారు.

**గ్రామ సర్పంచ్ రాఘవేందర్ రెడ్డి అభినందనలు...**

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ మాచన్నగారి రాఘవేందర్ రెడ్డి, గండు మనీషా ఆనంద్ రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహాలింగాపురం గ్రామ బిడ్డ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం thama గ్రామానికి గర్వకారణమని సంతోషం వ్యక్తం చేశారు. గండు మనీషా ఆనంద్ రెడ్డి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, ప్రజలకు న్యాయం చేకూర్చాలని, న్యాయవ్యవస్థలో తనదైన ముద్ర వేయాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నట్టు అయన తెలిపారు. గ్రామ ప్రజల తరపున ఆమెకు, వారి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఆమె సాధించిన విజయం రాబోయే తరాల విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

# దుర్గామాతకు శరన్నవరాత్రుల కుంకుమ పూజలు



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి గ్రామంలోని గాంధీ యువజన సమైక్య ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల సందర్భంగా 19వ వార్షికోత్సవం ను పురస్కరించుకొని దుర్గామాతను గాంధీ యువజన సమైక్య ఉత్సాహ కమిటీ అధ్యక్షులు నామాల శ్రీకాంత్ ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు, మాలస్వాములు, కండువా స్వాములు, కంకణ స్వాములు, బాల స్వాములు దాదాపు 60 మంది భక్తులు మాల అలంకరణ తీసుకోవడం జరిగింది, రోజు ఉదయం 9 గంటలకు అమ్మవారి ప్రత్యేక అలంకరణ తర్వాత పూజా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది పూజారి జంగం దిలీప్ కుమార్ గారిచే ప్రత్యేక పూజలు చేయడం జరుగుతుంది అలాగే సాయంత్రం ఏడు గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుంది ఇట్టి కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు నామాల శ్రీకాంత్, నోముల సాయి, ఎల్లులనరేష్ , నామాల సత్యం, పిప్పరి లింబాద్రి 3వ వార్డు మెంబర్, కామారెడ్డి భరత్ గౌడ్, నామాల దినేష్ కుమార్, కాశబోయిన చందు గురుస్వాములు , కండువా స్వాములు, కంకన స్వాములు, బాల స్వాములు భక్తులు గ్రామప్రజలు ఆడపడుచులు పాల్గొన్నారు.

## అంత్యక్రియల్లో పాల్గొని, పాడే మోసిన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** ఎల్లారెడ్డి నియోజకవర్గం సదాశివ నగర్ మండల్ మర్కల్ గ్రామానికి చెందిన దొకూరి రామ్ రెడ్డి అకాల మరణం చెందడంతో వారి భౌతికకాయానికి నివాళులర్పించిన పాడే మోసిన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మర్కల్ గ్రామానికి చెందిన దొకూరి రామ్ రెడ్డి అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు జాజాల సురేందర్ మృతుడి స్వగృహానికి చేరుకుని వారి పార్థివదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంట స్థానిక బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,ప్రజాప్రతినిధులు, , కార్యకర్తలు , గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మియాపూర్ లో సుప్రజా హాస్పిటల్స్ నూతన బ్రాంచ్ ప్రారంభం




**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** శేరిలింగంపల్లి మియాపూర్ లో ధంతూరి గ్రూప్ కు చెందిన సుప్రజా హాస్పిటల్స్ నూతన బ్రాంచ్ ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరై ఆసుపత్రిని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం అతిథులను హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ గౌడ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆధునిక వైద్య సదుపాయాలతో పాటు అత్యవసర సమయాల్లో సకాలంలో చికిత్స అందించడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. సుప్రజా హాస్పిటల్స్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## పీ ఏ సీ చైర్మన్, ఎమ్మెల్యే ఆ రెక పూడి గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బలరాం యాదవ్



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెక పూడి గాంధీ జన్మదిన సందర్భంగా శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బలరాం యాదవ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని కొండాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజమోహన్ రావు, నాగరాజు, రేపల్లె అశోక్, సన్నీ యాదవ్, మాధవ్, వెంకటయ్య, ప్రేమ్, సాయి చరణ్, మల్లికార్జున్, రవితేజ, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసి, ముగ్గు పోసిన సర్పంచ్ మనిషా రామస్వామి

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామం లో గురువారం రోజున కొడగండ్ల సవిత భాస్కర్, బస్వాపురం బాల ముత్తవ్వ ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసి ముగ్గు పోసిన గ్రామ సర్పంచ్ మనిషా రామస్వామి ఇల్లు ఆర్డర్ కాపీ అందజేశారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముత్యాల రాజు, వార్డ్ మెంబర్స్ వడ్ల లింగమాచారి, బొమ్మడి సాయి రెడ్డి, ఇందిరమ్మ కమిటీ మెంబర్స్ పెండేలా నర్సారెడ్డి, దుంపల బాలరాజ్, ఉల్లంగి లింగం, గ్రామ సెక్రెటరీ బండి నరేష్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





## కోహ్లీకి సత్య నాదెళ్ల స్వాగతం!

**న్యూఢిల్లీ, అక్టోబరు 15 :** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రముఖ వృత్తిపరమైన నెట్‌వర్కింగ్ వేదిక లింక్డిన్‌లో అడుగుపెట్టాడు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. కోహ్లీ తొలి పోస్టుపై స్పందించిన నాదెళ్ల.. ఆయన కొత్త వ్యాపార ప్రయాణానికి అభినందనలు తెలిపారు. కోహ్లీ లింక్డిన్‌లోకి రావడంతో తన ఫీడ్ మరింత ఆసక్తికరంగా మారిందని పేర్కొన్నారు. లింక్డిన్‌లో తన తొలి పోస్టు ద్వారా కోహ్లీ భారత క్రీడలకు ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు తీసుకురావాలన్న ఆకాంక్షను వెల్లడించాడు. దేశంలో క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలకూ ఆదరణ పెరగాలని, భారతీయ బ్రాండ్లు అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రత్యేక గుర్తింపు సంపాదించాలని అభిప్రాయపడ్డాడు. ఈ లక్ష్యంతోనే వ్యాపార రంగంలోనూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపాడు. కోహ్లీ 'అగిలిటాస్ స్పోర్ట్స్'లో పెట్టుబడిదారుడిగా, 'వన్8వరల్డ్'లో సహ వ్యవస్థాపకుడిగా వ్యవహరిస్తున్నాడు. క్రీడలతో తనకున్న అనుబంధాన్ని వ్యాపార రంగంలోనూ విస్తరించుకుంటూ భారతీయ క్రీడా సంస్కృతికి, దేశీయ బ్రాండ్లకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాడు. నాదెళ్ల నుంచి వచ్చిన అభినందనలు ఈ కొత్త ప్రయాణానికి మరింత ప్రాధాన్యం తీసుకొచ్చాయి. లింక్డిన్‌లో కోహ్లీ ప్రవేశానికి అభిమానులు, నెటిజన్ల నుంచి విశేష స్పందన లభించింది. ఖాతా ప్రారంభించిన తొలి 24 గంటల్లోనే ఆయన అనుచరుల సంఖ్య 2.4 లక్షలు దాటినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. మైదానంలో తన బ్యాటింగ్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న కోహ్లీ.. ఇప్పుడు వ్యాపార రంగంలోనూ తన ఆలోచనలు, లక్ష్యాలను పంచుకుంటూ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాడు.

# ఆసియా పతక విజేతలతో మోదీ భేటీ

- 85 పతకాలతో భారత్ సత్తా.. విజేతలకు ప్రధాని అభినందనలు
- మహిళా అథ్లెట్ల ఖాతాలో 38 పతకాలు.. 11 స్వర్ణాలు
- 44 ఏళ్ల తర్వాత మహిళల హాకీ జట్టుకు స్వర్ణం
- కొత్త ఛాంపియన్లు, రికార్డులే లక్ష్యంగా క్రీడాకారులకు పిలుపు




న్యూఢిల్లీ, అక్టోబర్ 15: అంతర్జాతీయ క్రీడా వేదికలపై భారత యువత తమ ప్రతిభను చాటుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. జపాన్‌లోని ఐచి-నగోయాలో జరిగిన ఆసియా క్రీడలు 2026లో పతకాలు సాధించిన భారత క్రీడాకారులతో గురువారం న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ నేషనల్ స్టేడియంలో ఆయన సమావేశమయ్యారు. దేశానికి గౌరవం తీసుకొచ్చిన విజేతలను అభినందించారు. ఈసారి భారత్ మొత్తం 85 పతకాలు సాధించిందని, ఇందులో 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విజయాలు దేశంలో మారుతున్న క్రీడా సంస్కృతికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. క్రీడాకారుల విజయాల వెనుక వారి కఠోర శ్రమతో పాటు కోచ్‌లు, సహాయక సిబ్బంది, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం కూడా ఉందని మోదీ అన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ప్రస్తావిస్తూ ఆయనకు నివాళులర్పించారు.

### మహిళా అథ్లెట్ల ప్రతిభకు ప్రశంసలు

ఆసియా క్రీడల్లో భారత మహిళా క్రీడాకారులు సాధించిన విజయాలను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. మొత్తం 85 పతకాల్లో మహిళా అథ్లెట్లు 38 పతకాలు సాధించారని, వాటిలో 11 స్వర్ణాలు ఉన్నాయని తెలిపారు. పతకాలు కేవలం సంఖ్యలు మాత్రమే కాదని, దేశ సామర్థ్యాన్ని చాటిచెప్పే విజయాలని పేర్కొన్నారు. గతంలో పెద్దగా పతకాలు సాధించని మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ), సాఫ్ట్ టెన్నిస్, సెయిలింగ్ వంటి క్రీడల్లోనూ భారత అథ్లెట్లు రాణించడం సంతోషకరమన్నారు.

### హాకీ, క్రికెట్, కబడ్డీలో స్వర్ణాలు

ఆసియా క్రీడల్లో భారత మహిళలు, పురుషుల హాకీ జట్లతో పాటు రెండు క్రికెట్ జట్లు స్వర్ణ పతకాలు సాధించాయి. మహిళలు, పురుషుల కబడ్డీ జట్లు కూడా పసిడి పతకాలు గెలుచుకున్నాయి. మహిళల హాకీ జట్టు స్వర్ణం సాధించడం ద్వారా 44 ఏళ్ల నిరీక్షణకు తెరపడిందని మోదీ పేర్కొన్నారు. మహిళల హాకీ జట్టు ఫైనల్‌లో చైనాను 1-0తో ఓడించి స్వర్ణం సాధించడంతో పాటు 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. పురుషుల జట్టు ఫైనల్‌లో మలేషియాను 5-1తో ఓడించి పసిడి పతకాన్ని దక్కించుకోవడంతో పాటు ఒలింపిక్స్ బెర్తును ఖాయం చేసుకుంది. ఈ సందర్భంగా ఇరు జట్ల సభ్యులు తమ జెర్సీలను ప్రధానమంత్రికి బహూకరించారు.

### కొత్త రికార్డులు సృష్టించాలని పిలుపు

భారత క్రీడా రంగాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు క్రీడాకారులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని మోదీ సూచించారు. ప్రతి మైదానంలో త్రివర్ణ పతాకానికి గౌరవం తీసుకురావడం, అంతర్జాతీయ స్థాయిలో భారత క్రీడలకు కొత్త గుర్తింపు సాధించడం, ప్రతి విభాగంలో కొత్త ఛాంపియన్లను తయారు చేయడం, సరికొత్త రికార్డులు నెలకొల్పడం వంటి లక్ష్యాలపై ప్రతిజ్ఞ చేయాలని కోరారు. విజయాలు ఒక్కరోజులో సాధ్యం కావని, వాటి కోసం ఏళ్ల తరబడి పట్టుదలతో శ్రమించాల్సి ఉంటుందని అన్నారు. గత 12 ఏళ్లుగా దేశంలో క్రీడా సంస్కృతిని బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఒకప్పుడు కొన్ని క్రీడలకు మాత్రమే పరిమితమైన భారత్.. ఇప్పుడు విభిన్న క్రీడాంశాల్లో పాల్గొంటూ పతకాలు సాధించే స్థాయికి చేరుతోందని మోదీ పేర్కొన్నారు.




## స్మృతి మంధాన ముందు ప్రపంచ రికార్డు!

**న్యూఢిల్లీ, అక్టోబరు 15 :** భారత మహిళల క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధానకు కెప్టెన్‌గా తొలి సవాల్ ఎదురుకానుంది. భారత్, జింబాబ్వే మహిళల జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ అక్టోబరు 16 నుంచి ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో పూర్తిస్థాయి సారథిగా బరిలోకి దిగనున్న మంధాన.. తొలి మ్యాచ్‌లోనే జట్టుకు విజయాన్ని అందించాలని పట్టుదలతో ఉంది. మరోవైపు, ఈ సిరీస్‌లో ఆమె ముందు అరుదైన ప్రపంచ రికార్డు కూడా ఉంది.

### మరో 133 పరుగులు చేస్తే చరిత్ర!

అంతర్జాతీయ మహిళల టీ20 క్రికెట్‌లో 5,000 పరుగుల మైలురాయిని చేరుకోవడానికి స్మృతి మంధానకు మరో 133 పరుగులు అవసరం. ఈ లక్ష్యాన్ని చేరుకుంటే అంతర్జాతీయ మహిళల టీ20ల్లో 5,000 పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా ఆమె చరిత్ర సృష్టించనుంది. ఇప్పటివరకు 179 మ్యాచ్‌ల్లో 4,867 పరుగులు సాధించిన మంధాన ఖాతాలో రెండు శతకాలు, 37 అర్ధశతకాలు ఉన్నాయి. ఆమె స్ట్రైక్‌రేట్ 127.5గా ఉంది. జింబాబ్వేతో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్‌లోనే ఈ ఘనత సాధించే అవకాశం ఉండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

### అత్యధిక పరుగుల జాబితాలో అగ్రస్థానానికి చేరువగా..

మహిళల అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో మంధాన ముందంజలో ఉంది. న్యూజిలాండ్ బ్యాటర్ సుజీ బేట్స్ 4,758 పరుగులతో తర్వాతి స్థానంలో ఉండగా, హర్మన్‌ప్రీత్ కౌర్ 4,327 పరుగులు, శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టు 4,282 పరుగులతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఈ సిరీస్‌లో మంధాన తన బ్యాటింగ్ జోరును కొనసాగిస్తే 5,000 పరుగుల మైలురాయిని అందుకోవడంతో పాటు తన రికార్డును మరింత మెరుగుపరుచుకునే అవకాశం ఉంది.

### కెప్టెన్‌గా తొలి పరీక్ష

సారథ్య బాధ్యతలు చేపట్టిన తర్వాత మంధానకు ఈ సిరీస్ కీలకంగా మారనుంది. జట్టును ముందుండి నడిపించడంతో పాటు బ్యాటర్‌గా కూడా రాణించాల్సిన బాధ్యత ఆమెపై ఉంది. భారత్, జింబాబ్వే మధ్య మూడు టీ20 మ్యాచ్‌లు అక్టోబరు 16, 18, 20 తేదీల్లో జరగనున్నట్లు సమాచారం. ఈ మ్యాచ్‌లకు రాయ్‌పూర్ ఆతిథ్యమివ్వనుంది. తొలి మ్యాచ్‌లో విజయం సాధించడంతో పాటు వ్యక్తిగతంగా ప్రపంచ రికార్డును అందుకోవడంపై మంధాన దృష్టి సారించనుంది.

# అవార్డుల బరువుతో హోప్ సరదా వ్యాఖ్యలు!

**హైదరాబాద్, అక్టోబరు 15 :** భారత పర్యటనలో వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ పరుగుల వరద పారిస్తున్నాడు. వన్డేల్లోనే కాకుండా టీ20ల్లోనూ భారత బౌలర్లకు సవాల్ విసురుతూ వరుస శతకాలతో అదరగొడుతున్నాడు. ఈ పర్యటనలో ఇప్పటికే మూడుసార్లు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు అందుకున్నాడు. వరుస విజయాలతో ఆనందంలో ఉన్న హోప్.. అవార్డులన్నింటినీ స్వదేశానికి ఎలా తీసుకెళ్లాలంటూ సరదాగా వ్యాఖ్యానించాడు.

### వన్డేల్లోనూ.. టీ20ల్లోనూ శతకాల మోత

వన్డే సిరీస్‌లో భారత బౌలర్లపై విరుచుకుపడిన షాయ్ హోప్.. పొట్టి క్రికెట్‌లోనూ అదే జోరు కొనసాగిస్తున్నాడు. వన్డేల్లో గువాహటిలో 104 పరుగులు, న్యూ ఛండీగఢ్‌లో అజేయంగా 162 పరుగులు చేసి తన సత్తా చాటాడు. తాజాగా టీ20 సిరీస్‌లోనూ రాంచీలో అజేయంగా 102 పరుగులు, హైదరాబాద్‌లో మరో అజేయ శతకంతో ఆకట్టుకున్నాడు. ఫార్మాట్ మారినా తన దూకుడు తగ్గదని నిరూపిస్తూ వెస్టిండీస్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు.

### అవార్డులన్నీ ఎలా తీసుకెళ్లాలి?

భారత్‌పై కీలక ఇన్నింగ్స్‌లు ఆడి మూడు సార్లు మ్యాచ్‌లో అత్యుత్తమ ఆటగాడి అవార్డును అందుకోవడంపై హోప్ సంతోషం వ్యక్తం చేశాడు. అదే సమయంలో అవార్డుల బరువు గురించి సరదాగా మాట్లాడాడు. స్వదేశానికి తిరిగి వెళ్లేటప్పుడు విమానాశ్రయంలో లగేజీ బరువు తనిఖీల






సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని చమత్కరించాడు. అవార్డులు గెలవడం ఆనందంగా ఉన్నా.. వాటన్నింటినీ తీసుకెళ్లడం మరో సమస్యగా మారిందన్నది అతడి వ్యాఖ్యల సారాంశం.

### చివరి మ్యాచ్‌పైనా హోప్ దృష్టి

భారత పర్యటనలో బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్న హోప్.. సిరీస్‌లో తన జట్టు విజయ పరంపరను కొనసాగించాలని భావిస్తున్నాడు. కీలక సమయాల్లో పరుగులు సాధిస్తూ జట్టుకు అండగా నిలుస్తున్న అతడు, నిర్ణయాత్మక మ్యాచ్‌లోనూ ఇదే ప్రదర్శన పునరావృతం చేయాలని పట్టుదలతో ఉన్నాడు. హోప్ ఫామ్ వెస్టిండీస్‌కు బలంగా మారగా, అతడిని కట్టడి చేయడం భారత బౌలర్లకు సవాల్‌గా మారింది.

# అగార్కర్ స్థానంలో కొత్త చైర్మన్ ఎవరు?

**ముంబై, అక్టోబరు 15 :** 2027 వన్డే ప్రపంచకప్‌కు సమయం దగ్గరపడుతున్న వేళ భారత క్రికెట్ జట్టు ఎంపికలపై బీసీసీఐ దృష్టి సారించింది. సెలక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ స్థానంలో కొత్త వ్యక్తిని నియమించే అంశంపై కసరత్తు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ప్రపంచకప్‌కు ముందు జట్టు ఎంపిక విధానంలో పెద్దగా మార్పులు చేయకుండా ప్రస్తుత వ్యవస్థనే కొనసాగించాలని బోర్డు భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తాత్కాలిక చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ప్రజ్ఞాన్ ఓజాను కొనసాగించే అవకాశాలపైనా చర్చ జరుగుతోంది.

### ఓజా కొనసాగింపుపై ఊహాగానాలు

అగార్కర్ పదవీకాలం పొడిగింపు కోరుకోవడం లేదన్న ప్రచారం నేపథ్యంలో కొత్త చైర్మన్ ఎంపికపై ఆసక్తి నెలకొంది. కొత్త వ్యక్తి బాధ్యతలు చేపడితే జట్టు ఎంపికలో ఆయన అనుసరించే విధానం, నిర్ణయాలు కీలకంగా మారనున్నాయి. ప్రపంచకప్ సన్నాహాల సమయంలో ఎంపికల విధానంలో మార్పులు చోటుచేసుకోకుండా చూడాలని బీసీసీఐ భావిస్తున్నట్లు పలు కథనాలు పేర్కొంటున్నాయి. ఈ కారణంగా ప్రజ్ఞాన్ ఓజానే మరికొంతకాలం తాత్కాలిక చైర్మన్‌గా కొనసాగించవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

### లక్ష్మణ్ ప్రభావం పెరుగుతుందా?

బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు నేతృత్వం వహిస్తున్న మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రభావం జట్టు ఎంపికల వ్యవహారంలో పెరిగే అవకాశం





ఉందని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' కథనం పేర్కొన్నట్లు సమాచారం. అయితే దీనిపై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రపంచకప్‌కు ముందు ఆటగాళ్ల ఎంపిక, జట్టు కూర్పు, భవిష్యత్ ప్రణాళికల్లో స్థిరత్వాన్ని కొనసాగించడం బోర్డుకు కీలకంగా మారింది.

### పార్థివ్ పటేల్ దరఖాస్తు చేయలేదా?

వెస్ట్ జోన్ నుంచి ఖాళీ అయిన సెలక్టర్ పదవికి దరఖాస్తుల గడువు అక్టోబరు 14తో ముగిసినట్లు సమాచారం. మాజీ భారత వికెట్ కీపర్ బ్యాటర్ పార్థివ్ పటేల్ ఈ పదవికి దరఖాస్తు చేస్తారని తొలుత ప్రచారం జరిగింది. అయితే ఆయన దరఖాస్తు చేయలేదని కొన్ని వార్తా కథనాలు వెల్లడించాయి. ఈ విషయంపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది.

### ఎస్ఎస్ దాస్ పదవీకాలంపై చర్చ

ప్రస్తుత సెలక్షన్ కమిటీలో ప్రజ్ఞాన్ ఓజాతో పాటు ఎస్ఎస్ దాస్, ఆర్పీ సింగ్, అజయ్ రాత్రా సభ్యులుగా ఉన్నారు. దాస్ డిసెంబరుతో సెలక్టర్‌గా నాలుగేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకోనున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఆయనను 2027 ప్రపంచకప్ వరకు కొనసాగించే అవకాశాలపైనా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. అయితే కొత్త చైర్మన్ నియామకం, ఓజా కొనసాగింపు, ఇతర సభ్యుల పదవీకాలంపై బీసీసీఐ అధికారికంగా స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ప్రపంచకప్ సన్నాహాల నేపథ్యంలో సెలక్షన్ కమిటీలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

# సన్నీ డియోల్‌తో ప్రగ్యా జైస్వాల్!



**హైదరాబాద్, అక్టోబరు 15 :** టాలీవుడ్‌లో పలు చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక ప్రగ్యా జైస్వాల్ బాలీవుడ్‌లోనూ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇప్పటికే అక్షయ్ కుమార్ నటించిన 'ఖేల్ ఖేల్ మే' చిత్రంలో కనిపించిన ఆమె.. ఇప్పుడు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సన్నీ డియోల్ నటిస్తున్న 'సూర్య' సినిమాలో భాగమయ్యారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార చిత్రాన్ని విడుదల చేయడంతో పాటు, విడుదల తేదీని కూడా చిత్రబృందం ప్రకటించింది. ఎం. పద్మకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య' చిత్రంలో సన్నీ డియోల్, ప్రగ్యా జైస్వాల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. రవికిషన్, మనీష్ వాధ్వా తదితరులు కూడా ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. కమల్ ముకుత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా విడుదలైన ప్రచార చిత్రంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఈ చిత్రాన్ని నవంబరు 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. 2018లో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న మలయాళ క్రైమ్ థ్రిల్లర్ 'జోసెఫ్' ఆధారంగా 'సూర్య' తెరకెక్కుతోంది. ఈ కథ ఇప్పటికే తెలుగులో రాజశేఖర్ కథానాయకుడిగా 'శేఖర్' పేరుతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తమిళం, కన్నడ భాషల్లోనూ పునర్నిర్మాణమైంది. మరో విశేషం ఏమిటంటే, మలయాళ మూల చిత్రానికి దర్శకత్వం వహించిన ఎం. పద్మకుమారే హిందీ రూపాంతరానికి కూడా దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో తన నటనతో గుర్తింపు తెచ్చుకున్న ప్రగ్యా జైస్వాల్.. ఇప్పుడు బాలీవుడ్‌లో వరుస అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నారు. సన్నీ డియోల్ వంటి ప్రముఖ నటుడితో కలిసి నటిస్తున్న 'సూర్య' ఆమె కెరీర్‌కు ఎంతవరకు ఉపయోగపడుతుందో చూడాలి. నవంబరు 20న విడుదల కానున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో తెలియాలంటే మరికొంతకాలం వేచి చూడాల్సిందే.



# కీర్తి సురేశ్ 'సత్యవాన్ సావిత్రి' టీజర్ విడుదల

**హైదరాబాద్, అక్టోబరు 15 :** జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సత్యవాన్ సావిత్రి'. ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అధికారిక టీజర్ తాజాగా విడుదలైంది. హాస్యం, న్యాయస్థానం నేపథ్యంలో సాగే కథతో రూపొందిన ఈ టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. నవంబరు 20, 2026న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. చిన్నప్పటి నుంచి న్యాయవాది కావాలనే లక్ష్యంతో కుటుంబాన్ని ఎదురించి న్యాయశాస్త్రం చదివిన సావిత్రి అనే యువతి పాత్రలో కీర్తి సురేశ్ నటిస్తున్నారు. ఆమె వృత్తి జీవితంలో చేపట్టిన తొలి కేసు చుట్టూ కథ సాగుతుంది. న్యాయస్థానంలో ఆమె ఎదుర్కొనే సవాళ్లు, అమాయకంగా చేసే వాదనలు టీజర్‌లో నవ్వులు పూయిస్తున్నాయి. గంభీరమైన కోర్టు వాతావరణాన్ని వినోదాత్మకంగా చూపిస్తూ సినిమా కథపై ఆసక్తిని పెంచారు. ప్రముఖ దర్శకుడు, నటుడు మిస్కిన్ ఈ చిత్రంలో మార్కండేయన్ అనే శక్తిమంతమైన న్యాయవాది పాత్రలో కనిపించనున్నారు. న్యాయస్థానంలో సావిత్రికి ప్రత్యర్థిగా ఆయన చేసే వాదనలు, కీర్తి సురేశ్‌తో జరిగే పోటీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. వీరిద్దరి మధ్య సాగే కోర్టు సన్నివేశాలు ప్రేక్షకులను అలరించేలా ఉంటాయని టీజర్ సూచిస్తోంది. ఈ చిత్రంలో చారుకేశ్, బాల శరవణన్, శిల్పా మంజునాథ్, బాలాజీ శక్తివేల్, ఆర్. సుందర్రాజన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, అరుణ్ విన్సెంట్ ఛాయాగ్రహణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జీ స్టూడియోస్, డ్రమ్‌స్టిక్స్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. న్యాయస్థానంలో జరిగే వాదోపవాదాలను హాస్యం, వినోదంతో మేళవించి రూపొందించిన 'సత్యవాన్ సావిత్రి' నవంబరు 20, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది. కీర్తి సురేశ్ నటన, మిస్కిన్‌తో ఆమె తలపడే సన్నివేశాలు ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చిత్రబృందం ఆశిస్తోంది.



అగ్ర కథానాయిక మృణాల్ ఠాకూర్ గత తొమ్మిది నెలలుగా ఒక్క సినిమాకూ అంగీకారం తెలపలేదని వెల్లడించింది. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషించనున్నట్లు వస్తున్న వార్తలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తనకు సినిమాల్లో నటించే అవకాశాలు వస్తున్నప్పటికీ, కథలు మనసుకు నచ్చకపోవడంతో కొత్త చిత్రాలకు అంగీకరించడం లేదని మృణాల్ తెలిపింది. గత తొమ్మిది నెలలుగా ఏ సినిమాకూ సంతకం చేయలేదని స్పష్టం చేసింది. ఒక సినిమా కోసం మూడు, నాలుగు నెలల సమయాన్ని కేటాయించాల్సి ఉంటుందని, అంత సమయం వెచ్చించాలంటే కథలో ప్రత్యేకత ఉండాలని అభిప్రాయపడింది. అందుకే కొంతకాలం సినిమాలకు విరామం తీసుకున్నట్లు వివరించింది. అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' చిత్రంలో మృణాల్ ఠాకూర్ నటిస్తున్నట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఆమె చిత్రీకరణలోనూ పాల్గొంటున్నట్లు ముంబై సినీ వర్గాల్లో కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు. మృణాల్ తాజా వ్యాఖ్యలతో ఆమె ఈ చిత్రంలో నటిస్తుందా లేదా అన్న అంశంపై మరింత ఆసక్తి నెలకొంది. అధికారిక సమాచారం వెలువడితేనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# సినిమా రంగంపై ఆనంది భావోద్వేగం



**హైదరాబాద్, అక్టోబరు 15:** సినీ పరిశ్రమలో అవకాశాలు అందుకోవడం, నటిగా గుర్తింపు తెచ్చుకోవడం అంత సులభం కాదని నటి ఆనంది అన్నారు. కొన్నిసార్లు ఈ రంగంలో కొనసాగడం తనకు కష్టంగా అనిపిస్తుందని భావోద్వేగానికి గురయ్యారు. ఆమె నటించిన 'గరివిడి లక్ష్మి' సినిమా విడుదలకు ముందు నిర్వహించిన వేడుకలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 'ఒక్కోసారి నేను ఈ సినిమా రంగానికి సరిపోనేమో అనిపిస్తుంది. ఇక్కడ సినిమాలు చేయాలంటే ఎన్నో లెక్కలు, సమీకరణాలు, రాజకీయాలు ఉంటాయి' అంటూ ఆనంది తన మనసులోని మాటలను వెల్లడించారు. ప్రతిభతో పాటు పరిశ్రమలోని పరిస్థితులను కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె వ్యాఖ్యలను బట్టి తెలుస్తోంది. అయితే ఆమె ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారన్న దానిపై స్పష్టత లేదు. 'గరివిడి లక్ష్మి' చిత్రంలో ఆనంది ప్రధాన పాత్ర పోషించారు. ఉత్తరాంధ్రకు చెందిన ప్రముఖ జానపద కళాకారిణి రెడ్డి విజయలక్ష్మి జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రూపొందినట్లు సమాచారం. ఈ పాత్రలో సహజంగా కనిపించేందుకు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర మాండలికంలో మాట్లాడేందుకు ఎంతో కష్టపడ్డానని ఆనంది తెలిపారు. ఈ చిత్రం ద్వారా ఆ కళాకారిణికి మరింత గుర్తింపు లభించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రేక్షకులు తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని భావోద్వేగంగా పేర్కొన్నారు. బుర్రకథ కళాకారిణిగా గరివిడి లక్ష్మి సాధించిన గుర్తింపు, ఆమె జీవితంలో ఎదురైన సవాళ్లు, చేసిన పోరాటాలను ఈ చిత్రంలో చూపించనున్నట్లు తెలుస్తోంది. పురుషాధిక్యత ఎక్కువగా ఉన్న జానపద కళారంగంలో ఒక మహిళగా అడుగుపెట్టి తన ప్రతిభతో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఆమె జీవితం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. నిజజీవిత కళాకారిణి పాత్రను తెరపై ఆవిష్కరించేందుకు ఆనంది చేసిన కృషి ఈ చిత్రంపై ఆసక్తిని పెంచుతోంది.

# సాయిదుర్గా తేజ్ 19వ సినిమా ప్రకటన

**హైదరాబాద్, అక్టోబరు 15 :** మెగా హీరో సాయిదుర్గా తేజ్ తన తదుపరి చిత్రానికి సంబంధించిన కీలక ప్రకటనతో అభిమానుల్లో ఆసక్తి పెంచారు. తన పుట్టినరోజు సందర్భంగా కెరీర్‌లో 19వ సినిమాను ప్రకటించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుండగా, 'సేవ్ ది టైగర్స్' వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న తేజ కనుమ దర్శకత్వం వహించనున్నారు. కుటుంబ సంబంధాలు, హాస్యం, వినోదంతో కూడిన కథాంశాలకు పేరుపొందిన తేజ కనుమ.. ఇప్పుడు సాయిదుర్గా తేజ్‌తో కలిసి సినిమా చేయనుండటం ఆసక్తికరంగా మారింది. ఓటీటీ ప్రేక్షకులను ఆకట్టుకున్న 'సేవ్ ది టైగర్స్' సిరీస్‌తో గుర్తింపు పొందిన ఆయన, ఈసారి వెండితెరపై మెగా హీరోను ఎలా చూపించబోతున్నారనే చర్చ మొదలైంది. ఈ సినిమా కథాంశం ఏమిటి? సాయిదుర్గా తేజ్ ఎలాంటి పాత్రలో కనిపించనున్నారు? అనే వివరాలు ఇంకా వెల్లడికాలేదు. ప్రస్తుతం హీరో, దర్శకుడు, నిర్మాణ సంస్థ వివరాలను మాత్రమే ప్రకటించారు. ఇతర నటీనటులు, సాంకేతిక బృందం వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది. సాయిదుర్గా తేజ్ కెరీర్‌లో 19వ చిత్రంగా తెరకెక్కనున్న ఈ ప్రాజెక్టును ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది. విభిన్న కథలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్న ఈ హీరో, తేజ కనుమతో ఎలాంటి కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారన్న ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు సాయిదుర్గా తేజ్ ప్రస్తుతం 'సంబరాల ఏటిగట్టు' సినిమాతో బిజీగా ఉన్నారు. ఈ చిత్రంపైనా అభిమానుల్లో అంచనాలు ఉన్నాయి. ఒకవైపు ఈ ప్రాజెక్టుపై దృష్టి సారిస్తూనే, మరోవైపు కొత్త సినిమాను ప్రకటించడం ద్వారా తన తదుపరి చిత్ర ప్రయాణానికి ఆయన సిద్ధమవుతున్నారు. పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమా ప్రకటన రావడంతో అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.




# పుట్టపర్తిలో విజయ్-రష్మిక పూజలు

**పుట్టపర్తి, అక్టోబరు 15 :** టాలీవుడ్ ప్రముఖ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. తమ చిత్రం 'రణబాలి' విడుదల వేళ ఈ జంట సత్యసాయి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొనడం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించింది. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో జరుగుతున్న వార్షిక వేద పురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం కార్యక్రమాల్లో భాగంగా విజయ్, రష్మిక సాయి కుల్వంత్ హాల్‌ను సందర్శించారు. అక్కడ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు. దసరా నవరాత్రుల సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ జంట కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజయ్ దేవరకొండకు శ్రీసత్యసాయి విద్యాసంస్థలతో ప్రత్యేక అనుబంధం ఉండటంతో ఆయన పుట్టపర్తి పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. విజయ్, రష్మిక కలిసి పూజల్లో పాల్గొన్న దృశ్యాలు, ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajgiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com